

## సోమశిలలో 68.737 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 1,884 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 68.737 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

7 ఈఎస్‌ఐ ఆసుపత్రిలో మందుల కొరత



నెల్లూరు : జిల్లా టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సోమిరెడ్డి, అజీజ్, కోటంరెడ్డి తదితరులు

## అట్టహాసంగా..

### మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు



ఉదయగిరిలో 43 కిలోల కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీశ్రేణులు నిర్వహించాయి. పార్టీ కార్యాలయాల్లో కేకులు కట్‌చేసి, సంబరాలు చేసుకున్నారు. అలాగే, ఆలయాల్లో లోకేష్ పేరిట పూజలు, కుట్టుమిషన్లు, విద్యాసామగ్రి పంపిణీతోపాటు అన్నదానం చేశారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు కేకు కట్ చేసి, అందరికీ పంచి పెట్టారు. కందుకూరులో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. కావలిలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కేకు కట్ చేశారు. నెల్లూరు నగరం, ఆత్మకూరు, ఉదయగిరి, సర్వేపల్లి, కోవూరు తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు లోకేష్ జన్మదిన వేడుకలను అట్టహాసంగా జరిపారు.

### ఆ అధికారం

## స్థానిక సంస్థలదే!

- నుడా అధికారాలు బదలాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- లేఅవుట్లు, భవనాల అనుమతుల అధికారం మున్సిపాలిటీలదే
- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాలు కూడా వాటికే అప్పగింత
- పంచాయతీలు మాత్రం నుడా పరిధిలోనే

**నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థలకు పెద్దపీట వస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్లు, పెద్ద భవనాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే అధికారాన్ని స్థానిక సంస్థలకు కట్టబెడుతూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఉన్న కీలక అధికారాలను మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు బదలాయిస్తూ జీవో నెం.5 విడుదల చేసింది.**



నెల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడ లేఅవుట్ వేసినా ఇప్పటివరకూ నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) అనుమతులు మంజూరు చేస్తుండేది. ఇకపై నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలు, బుచ్చి, అల్లూరు నగర పంచాయతీల పరిధిలో వేసే లేఅవుట్లకు ఆయా స్థానిక సంస్థలే అనుమతులు మంజూరు చేయనున్నాయి. భవనాల అనుమతులకు కూడా ఇదే విధానం అమలవుతుంది. అయితే పంచాయతీలను మాత్రం నుడాలోనే కొనసాగించారు. అక్కడ ఎటువంటి లేఅవుట్ వేసినా నుడా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇక మరో కీలకమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాన్ని కూడా స్థానిక సంస్థలకే కట్టబెట్టారు. అక్రమ లేఅవుట్లు, అనధికార భవనాలపై నిఘా ఉంచి, చర్యలు తీసుకునే అధికారాలను కార్పొరేషన్, - మిగతా 6లో..

## ఎస్సీ కార్పొరేషన్ లక్ష్యాల అమలుకు ఆమోదం

నెల్లూరు (హరనాథపురం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన లక్ష్యాల అమలుకు కలెక్టర్ ఆమోదం తెలిపారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సీసీఎఫ్‌సీ లిమిటెడ్ చైర్మన్ మొత్తం 1134 వివిధ సెక్టార్లకు యూనిట్లను జిల్లాకు లక్ష్యంగా నిర్దేశించారని పేర్కొన్నారు. ఈ యూనిట్ల విలువ రూ.38.8కోట్లు కాగా, ఇందులో సబ్సిడీ రూ.17.86కోట్లుగా పేర్కొన్నారు. బ్యాంకు రుణం రూ.18.69కోట్లుగా తెలిపారు. ట్రాన్స్‌పోర్టు సెక్టారుకు 316, పశుసంవర్ధకశాఖకు 320, ఐఎస్‌బీకు 380, అగ్రికల్చరల్‌కి 118 యూనిట్లు కేటాయించారని ఆమె తెలిపారు. ఈ పథకాలకు అర్హత కలిగినవారు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ, పుట్టినతేదీ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫోన్ నెంబరుతో ఏపీ ఓబీ ఎంఎంఎస్ పోర్టల్ విడుదల కాగానే నమోదు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆమె తెలిపారు. వయసు 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలన్నారు.

### ● రీసర్వేపై సందేహాల నివృత్తికి కాల్ చేయండి

భూ యజమానులకు, సర్వే సిబ్బందికి, రెవెన్యూ సిబ్బందికి, రీసర్వేలో వచ్చిన సందేహాల నివృత్తికి రాష్ట్రస్థాయిలో హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశారని సర్వేశాఖ జిల్లా సహాయ సంచాలకులు నాగశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు 81436 79222గా ఆయన పేర్కొన్నారు. కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోగా పైనెంబరుకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.



## పన్ను లక్ష్యం రూ.130 కోట్లు

# వసూలు 48 కోట్లే!

- కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగం తీరిది
- మొండి బకాయిల ఊసెత్తని ఆర్‌ఐలు
- 2 నెలల్లో 62.7 శాతం వసూలు సాధ్యమేనా!?
- కొత్త అసెస్‌మెంట్లపైనే ధ్యాసంతా!
- 12 శాతానికే పరిమితమైన నీటి పన్ను వసూలు

**నెల్లూరు నగర పాలక సంస్థకు భారీగా ఆదాయం వచ్చే మార్గం ఉన్నా దానిని రాబట్టుకునే ధ్యాస అధికారులకు కరువైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా రూ.130 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు జమకావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.48.64 కోట్లే జమ అయింది. మరో 2 నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి రూ.81.36 కోట్ల పన్ను వసూలు సాధ్యమవుతుందా!? మొండి బకాయిల వైపు కన్నెత్తి చూడని ఆర్‌ఐలు వ్యక్తిగతంగా ఆదాయాన్ని తెచ్చిపెట్టే కొత్త అసెస్‌మెంట్లతోనే రోజులు గడిపేస్తున్నారు. ప్రతిరోజూ కమిషనర్ సూర్యతేజ, వీలైనప్పుడల్లా మంత్రి నారాయణలు సమీక్షలు పెట్టినా ఆశించిన ప్రగతి రెవెన్యూ విభాగంలో కనపడటం లేదన్న వాదన వ్యక్తమవుతోంది. కాగ రూ.55.72 కోట్ల నీటి పన్ను వసూళ్లకుగాను 12 శాతం రాబట్టిన రెవెన్యూ అధికారులు అంతటితో సరిపెట్టుకున్నారు.**

నెల్లూరులోని 54 డివిజన్లలో 1,40,122 అసెస్‌మెంట్ల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ పన్నుల ద్వారా రూ.69.63 కోట్లు, మొండి బకాయిలు ద్వారా మరో రూ.60.77 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు చేరాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు రెవెన్యూ విభాగం రూ.48.64 కోట్లు మాత్రమే వసూళ్లు చేసింది. సాధారణంగా కార్పొరేషన్‌కు వచ్చే పన్నులను మాత్రమే ఆర్‌ఐలు వసూళ్ల కింద చూపుతూ కాలం గడిపేస్తున్నారు. మొండి బకాయిల జోలికి మాత్రం వెళ్లడం లేదు. దీంతో అవి గుదిబండగా మారాయి. రూ.60.77 కోట్ల మొండి బకాయిలలో ఆర్‌ఐలు ఇప్పటివరకు రూ.8.10 కోట్లు మాత్రమే వసూలు చేసి చేతులు దులుపుకున్నారు. కార్పొరేషన్‌లో నెల వారి ఖర్చులు పెరుగుతున్నా జమలు మాత్రం అధికారికంగా ఖజానాలో నమోదవుడంలేదన్న విమర్శ ఉంది. ప్రతి నెల విద్యుత్ బకాయి రూ.కోటి, వాహన ఆయిల్ ఖర్చు మరో రూ.కోటి, ఉద్యోగుల జీతాలు ఇంకో రూ. కోటి వరకు లెక్కల్లోకి ఎక్కుతోంది. ఇలా రూ.3 కోట్లు ప్రతి నెల కార్పొరేషన్ సాధారణ చెల్లింపులకే సరిపోతోంది. దీనికి తగ్గట్టుగా ఆదాయం ఉన్నా వసూళ్లు మాత్రం అంతంతా మాత్రంగానే ఉంటోంది.

### ● 2 నెలల్లో రూ.81 కోట్లు సాధ్యమేనా?

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి 10 నెలలు పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ. 130 కోట్లకు రూ. 48 కోట్లు మాత్రమే రెవెన్యూ విభాగం పన్నులు వసూలు చేసింది. మిగిలిన రెండు నెలల్లో రూ.81 కోట్ల వసూలు సాధ్యమేనా!? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. పది నెలల కాల వ్యవధిలో 37 శాతం మాత్రమే పన్ను వసూలు చేసిన ఆర్‌ఐలు రెండు నెలల్లో ఏకంగా 62 శాతం పన్నులు ఖజానాకు జమ చేయగలరా!? అన్నది చర్చనీయాంశంగా మారింది. కార్పొరేషన్‌కు ఆదాయం తెచ్చిపెట్టే రెవెన్యూ విభాగం పనితీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

### ● నీటి పన్ను 12 శాతంతో సరి

కొళాయిలు, అపార్టుమెంట్ల వద్ద మీటర్లు ఇతర మార్గాల ద్వారా కార్పొరేషన్‌కు రూ.55.72 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. కానీ కేవలం రూ. 5.55 కోట్లు (12శాతం) వసూలు చేసి చేతులు దులుపుకున్నారు. రెండు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి మిగిలిన రూ.50.17 కోట్ల వసూలలు సాధ్యమేనా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎస్‌ఎంసీకి ఆదాయం తెచ్చిపెట్టే మార్గాలు ఉన్నా వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారంటూ పాలన యంత్రాంగంపై విమర్శలు ఉన్నాయి. అటు మంత్రి నారాయణ, ఇటు కమిషనర్ సూర్యతేజ నిర్వహించే సమీక్షలు ఆచరణకు నోచుకోవడం లేదన్న వాదన వ్యక్తమవుతోంది.




### ● వ్యక్తిగత ఆదాయంపైనే..

చెంబు అమ్మి ముంతకొనుకున్న సామెతగా తయారైంది రెవెన్యూ విభాగం పరిస్థితి. గతంలో పాత ఆర్‌ఐలు రోజుకు రూ.30-50 లక్షల వరకు రెవెన్యూ వసూళ్లను ఖజానాకు జమ చేస్తుంటే వాళ్లంతా పాతుకుపోయారన్న సాకుతో ఉన్నతాధికారులు కొత్తవారికి బాధ్యతలు అప్పగించారు. వీరు రోజుకు కనీసం రూ. 10 లక్షలు కూడా పన్ను వసూళ్లు చూపలేకపోవడం గమనార్హం. పైగా కొత్త అసెస్‌మెంట్లపైనే ధ్యాసంతా పెట్టడం విశేషం. వ్యక్తిగత ఆదాయాన్ని తెచ్చిపెట్టే కొత్త పన్నుల విధింపుపై మొగ్గు చూపుతున్న కొత్త ఆర్‌ఐలు పేర్ల మార్పిడి, పన్ను హెచ్చు, తగ్గులపై మాత్రమే శ్రద్ధ వహిస్తున్నారు. మొండి బకాయిల వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)





డీఆర్‌వో సమక్షంలో వాకాటిని చైర్మన్‌గా ప్రతిపాదనలు చేస్తున్న సభ్యులు

### రెడ్‌క్రాస్ చైర్మన్‌గా

## విజయకుమార్

నెల్లూరు (వైద్యం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ పాలకవర్గ చైర్మన్‌గా వాకాటి విజయ కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్‌రావు సమక్షంలో ఏకగ్రీవంగా ఈ ఎన్నిక జరిగింది. అలాగే వైస్ చైర్మన్‌గా చామర్తి జనార్ధన్‌రాజు, కోశాధికారిగా సురేష్ కుమార్ జైన్ ఎన్నికయ్యారు. తొలుత రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యుడు గునుపాటి ప్రసాద్‌రెడ్డి వాకాటి విజయ కుమార్‌రెడ్డిని చైర్మన్‌గా ప్రతిపాదించారు. ఇందుకు సభ్యులంతా ఏకగ్రీవంగా - మిగతా 6లో..

**ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేసిన టీచింగ్ స్టాఫ్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఏళ్ల తరబడి అన్‌ఎయిడెడ్, పార్ట్‌టైమ్ టీచింగ్‌లో సేవలందించిన సిబ్బంది ప్రస్తుతం ఉద్యోగాలు లేక, వయసు మీరి పోవడంతో ఎక్కడా చేరలేక అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యావిధానంలో ఎయిడెడ్ పాఠశాలలను ఆస్తులతో సహ పాఠశాలలను నాటి ప్రభుత్వంలో విలీనం చేశారు. 2004 నుంచి 2017 వరకు రిక్రూట్‌మెంట్‌పై నిషేధం ఉండడం, రెగ్యులర్ టీచర్లు రిటైర్డ్ కావడంతో ఈ పాఠశాలల్లో మంజూరు పోస్టుల్లో పనిచేసేందుకు విధుల్లో చేరిన పార్ట్‌టైమ్, అన్‌ఎయిడెడ్ టీచింగ్ సిబ్బంది నేడు ఏ ఉద్యోగాలు లేక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.**

### అన్ ఎయిడెడ్ సిబ్బందికి

# న్యాయం జరిగేనా?

### వైసీపీ ప్రభుత్వంలో ఎయిడెడ్ స్కూళ్ల విలీనం

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో టెట్ క్వాలిఫై అయిన నిరుద్యోగులు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఐదేళ్ల నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని నాటి కరస్పాండెంట్‌లు వారి విద్యార్హతలను, నైపుణ్యాలను పరిశీలించి నియామకాలు చేపట్టారు. నాటి నుంచి వీరంతా ఎయిడెడ్ పాఠశాలల అభివృద్ధికి, విద్యాబోధన అందించడంలోనూ, విద్యార్థుల సంఖ్యను పెంచడంలోనూ ఎంతో కృషి చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు యాజమాన్యాలు ఆమోదం తెలిపాయి. అదే క్రమంలో ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ ఎయిడెడ్, పార్ట్‌టైమ్ టీచర్స్ గురించి కూడా యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. ఇందులో భాగంగా గత ప్రభుత్వం ఏ యాజమాన్యాలు అయితే ఆస్తులతోసహ ప్రభుత్వానికి ఎయిడెడ్ పాఠశాలలను అప్పగిస్తారో అందులో పనిచేసే సిబ్బందికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. అయితే గత ప్రభుత్వం అన్‌ఎయిడెడ్ టీచర్స్ గురించి పట్టించుకోకుండా కంటితుడుపు చర్యగా వారి వివరాలను మాత్రం సేకరించారు. వీరికి ఎక్కడ ఉద్యోగాలు ఇవ్వాలి, ఎలా ఇవ్వాలన్న దానిపై స్పష్టత లేకపోవడం, అవగాహన రాహిత్యం కారణంగా వీరంతా రోడ్డున పడ్డారు. ఎప్పటి నుంచో ఎయిడెడ్ స్కూల్స్‌ను నమ్ముకుని జీవిస్తున్న ఈ సిబ్బందిని మాత్రం పక్కన పెట్టేశారు. అయితే వీరు పనిచేసిన పాఠశాలల్లో మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లను, సర్‌ప్లస్ ఎయిడెడ్ టీచర్లను నియమించి ఈ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా మార్పు చేశారు. జీవో నెం.50లో మాత్రం మార్పు చేసే పాఠశాలల్లో అన్ ఎయిడెడ్, పార్ట్‌టైమ్ సిబ్బందిని కూడా పరిగణలోకి తీసుకోవాలని, నియామకాలు చేపట్టాలని స్పష్టంగా ఉన్నా నాటి ప్రభుత్వం వీరిని పట్టించుకోకపోవ డంతో వీరి భవిష్యత్ నేడు ప్రశ్నార్థకంగా మారింది. నెల్లూరుతోపాటు రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, కర్నూలు జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ఉన్నత విద్యలో నాలుగు డిగ్రీ కళాశాలలు ప్రభుత్వంలోకి విలీనం చేసినా అందులో పనిచేస్తున్న అన్‌ఎయిడెడ్, పార్ట్‌టైమ్ సిబ్బందికి మాత్రం అవుట్ సోర్సింగ్, గెస్ట్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తూ జీవో విడుదల చేశారు. మూడేళ్లుగా తాము అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

### ● న్యాయం జరిగేనా?

సుదీర్ఘకాలంగా ఎయిడెడ్ పాఠశాలల్లో సేవలందించిన అన్‌ఎయిడెడ్, పార్ట్‌టైమ్ సిబ్బందికి న్యాయం చేయాలని సిబ్బంది కోరుతున్నారు. న్యాయపరంగా తమకు రావాల్సిన ఉద్యోగం గురించి ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. కొన్ని ఎయిడెడ్ స్కూల్స్ మాత్రం ప్రభుత్వానికి అప్పగించకుండా వారే నిర్వహిస్తుండగా ఆ పాఠశాలల్లో ప్రస్తుతం రిక్రూట్‌మెంట్లు చేపడుతున్నారని తెలిపారు.



## సపోర్టు ఉన్నా ఒరిగిపోయింది!

పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంట బ్రాంచి కాలువ ఎదురుగా ఉన్న పొలం గట్టుపై విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. వీటిని ఈ మధ్యకాలంలో ఏర్పాటు చేశారని అయినా ఈ సమస్య నెల కొందని రైతులు, రోడ్డున వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఏడెనిమిది విద్యుత్ స్తంభాలు ఇలాగే ఉన్నాయని పొలాలకు వెళ్లే రైతులు భయాందోళన చెందుతున్నారు. వీటిలో కొన్ని స్తంభాలకు 33/11కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్నాయని చెబుతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

## క్విజ్ పోటీల విజేత కేవీ



నెల్లూరు(విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'భారత్ హై హమ్' ధారావాహిక నుంచి సూచించిన అంశాలతో నగరం లోని కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాల యం(కేవీ)లో గురువారం జరిగిన క్విజ్ పోటీల్లో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం విజేతగా నిలిచింది. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల నుంచి వందమందికిపైగా ఈ పోటీల్లో పాల్గొనగా కేవీకి చెందిన సాన్విఅనిల్ ప్రథమ స్థానం, జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన విక్రమ్‌రెడ్డి ద్వితీయ స్థానం, కేవీకి చెంది న మహ్మద్ ఒమర్ తృతీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలకు కృష్ణపట్నం పోర్టు కస్టమ్స్ అధికారి క్రిష్ణేంతు రాజమింటూ బహుమతులు అందచేశా రు. కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ కే శంకరయ్య, సీసీఏ కో ఆర్డినేటర్ అలివేలు మంగా బాయి, హెచ్ ఎం టీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పారేసిన దస్త్రాలకు పరిష్కారమేది!?



బుచ్చి తహసీల్దారు కార్యాలయం వరండాలో ఏడాదికిపైగా దర్శనమిస్తున్న ఇవన్నీ జగనన్న సురక్ష దస్త్రాలే. జగన్ ప్రభుత్వ హయాంలో అర్హులంతా ఉచితంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందారు. ఆ వెంటనే ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రవేశపెట్టింది. ఆ పథకానికి జనాదరణ కరువైంది.దీంతో రెవెన్యూ అధికారులే సర్టిఫికెట్లు తీసుకున్నామని చెప్పినా, ఏ ఒక్కరిని వదలకుండా వలంటీర్లు కుటుంబంలోని అందరి వివరాల సేకరించారు. ఇలా బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో 12వేలకు పైచిలుకు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్టు లెక్కలు రాసుకుని రికార్డు సృష్టించారు. ఆ పథకం పాపమే తహసీల్దారు కార్యాలయంలో నేటికీ ఇలా దస్త్రాలు దర్శనమిస్తున్నాయి. వీటిని తొలగించే నాథుడే కరువయ్యాడు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)





ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప సంపద యోగా. దానిని జీవన విధానంగా మార్చుకున్నారు డాక్టర్ స్వప్న. యోగాలో అద్భుతాలను సృష్టిస్తూ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందడమేకాక డాక్టరేట్ సాధించారు. గృహిణిగా ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే యోగా గురువుగా రాణిస్తున్నారు. ఆధునిక సమాజానికి తగ్గట్లు యోగాలో టెక్నాలజీని మిళితం చేసి యువతకు తర్ఫీదునిస్తున్నారు. నేటితరం విద్యార్థులు, ఉద్యోగులు ఒత్తిళ్లను అధిగమించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడమెలాగో యోగాతో నేర్పుతున్నారు. యోగా గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారు. భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి (ఐసీసీఆర్) ద్వారా అంతర్జాతీయంగా యోగా తత్వశాస్త్రాన్ని ప్రచారం చేస్తున్నారు. తల్లిగా, గృహిణిగా కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూనే యోగా విద్యావేత్తగా ఎదిగిన ఆమె మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

యోగాలో తనకున్న 16 ఏళ్ల అనుభవంతో యోగా థెరపీలో ప్రావీణ్యం పొందిన స్వప్న అనేక మంది జీవితాలను మారుస్తున్నారు. ఆమె నిర్వహించే యోగాలయం యూట్యూబ్ చానెల్ ద్వారా వందకుపైగా వ్యాధుల కోసం యోగా థెరపీలను అందిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఆమెకున్న అనుభవాన్ని దృష్టిలోపెట్టుకుని కార్పొరేట్ ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ద్వారా కృషి చేస్తున్నారు. అలాగే, చిన్ననాటి విద్యలో యోగ తత్వాన్ని, రామాయణం, మహాభారతం, పంచతంత్ర వంటి పురాణ కథలతో సమన్వయం చేసే పరిశోధన చేస్తున్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ యోగా సర్టిఫికేషన్ బోర్డు ద్వారా యోగా పరీక్షరాలిగా ఎంపికైన డాక్టర్ స్వప్న యోగా విద్యలో నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్నో విశ్వవిద్యాలయాలు, ప్రఖ్యాత సంస్థల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలను నిర్వహించారు. తాను నేర్చుకున్న యోగాను అందరికీ పంచాలన్న లక్ష్యంతో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సహా పలు మెడికల్, ఇంజనీరింగ్ కళాశాల ల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అంతేకాదు, అంతర్జాతీయ వేదికపై భారతీయ యోగాను ప్రచారం చేయడానికి సిద్ధమవుతున్నారు.

**ఆరోగ్య జీవనానికి యోగాతో కృషి**

### బహుముఖ ప్రజ్ఞ

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ సాధించారు స్వప్న. భారతీయ తత్వశాస్త్రంలో డిప్లమో, తమిళనాడు అన్నామలై యూనివర్సిటీ నుంచి యోగాలో ఎమ్మె స్సీ, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యా లయం నుంచి యోగా పీజీ డిప్లమో కోర్సులను పూర్తి చేశారు. ప్రీనేటల్ యోగా, చైర్ యోగా వంటి ప్రత్యేకతలతో శిక్షణ పొందిన ఆమె యోగా అలయన్స్, యూఎస్ఏ ద్వారా గుర్తింపు పొందిన ఆర్‌వైటీ-500 (రిజిస్టర్ యోగా టీచర్)గా సేవలందిస్తున్నారు. తాజాగా ఇటీవల బెంగళూరుకు చెందిన ఎస్‌వైశ్య యూనివర్సిటీ నుంచి యోగాలో డాక్టరేట్ సాధించారు. హరిద్వార్‌లోని ఇండియన్ యోగా అసోసియేషన్ యోగా చికిత్స ఆచార్య బిరుదుతో ఆమెను సత్కరించింది.

# స్వప్న యోగం

- యోగాలో అద్వితీయ ప్రతిభ
- భారతీయ ప్రాచీన విద్యలో డాక్టరేట్
- సామాజిక మాధ్యమాలతో యోగా థెరపీ
- ఎంతో మందికి బోధన
- కేంద్ర ప్రభుత్వ గుర్తింపు
- అంతర్జాతీయ స్థాయిలో ప్రచారానికి సిద్ధం



యోగాలో డాక్టరేట్ అందుకుంటున్న స్వప్న



సినీ నటి రేణూదేశాయ్ నుంచి ఉత్తమ యోగా ఉపాధ్యాయిని అవార్డు అందుకుంటూ...

నెల్లూరు(విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు చెందిన డాక్టర్ జేకే స్వప్న యోగా ప్రస్థానం ఒనమాలతో ప్రారంభమై డాక్ట రేట్ వరకు సాగింది. నగరంలోని చిన్నబజారు ప్రాంతానికి చెందిన ఆమెకు ఇంటర్ తర్వాత కుటుంబ సభ్యులు వివాహం చేశారు. ఆ తర్వాత ఇద్దరు పిల్లల తల్లిగా ఉంటూనే కుటుంబ సభ్యుల సహకారంతో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆమె ప్రతిభను గుర్తించిన కళాశాల యాజమాన్యం అదే కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగావకాశాన్ని కల్పించారు. మూడేళ్లు బోధనా రంగంలో సేవలందించిన స్వప్న, ఆ తర్వాత మద్రాస్ ఐఐటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశారు. 2010లో యోగాపై దృష్టి సారించారు. క్రమంగా అందులో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ ఉద్యోగినిగా, ప్రపంచ యంగ్ యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా గుర్తింపు పొందారు.

### యోగా ప్రతిష్ట పెంచడమే లక్ష్యం

యోగా ప్రతిష్ఠను, కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను. లైఫ్‌స్టైల్ రుగ్మతలను యోగా చికిత్స ద్వారా తగ్గించేలా శిక్షణ ఇస్తున్నాను. ఆచార (ప్రవర్తన), విచార (ఆలోచనలు), ఆహార(ఆహారం), వ్యవహార(ప్రవర్తన) అనే నాలుగు స్తంభాలతో ఉన్న సమగ్ర దృక్పథాన్ని విశ్వసిస్తూ పనిచేస్తున్నాను. భారతీయ సాంస్కృతిక ఉపాధ్యాయురాలిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రపంచంలో ఏదో ఒక దేశాన్ని కేటాయించి రెండేళ్లపాటు ఆ దేశంలో యోగాను అభివృద్ధి చేసేందుకు కృషి చేసేలా అనుమతులిచ్చారు. ఆధునికతను అనుసరిస్తూనే సంప్రదాయాలను గౌరవించేలా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించాలన్నదే నా ధ్యేయం.

- డాక్టర్ జేకే స్వప్న



పూణే కైవల్యధామ యోగా ఇనిస్టిట్యూట్‌లో ఉత్తమ యోగా థెరపిస్ట్ అవార్డు అందుకుంటూ..

## కష్టకాలంలో పార్టీకి అండగా లోకేష్

- యువగళంతో ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు
- టీడీపీ నేతలు సోమిరెడ్డి, అజీజ్, కోటంరెడ్డి
- టీడీపీ కార్యాలయంలో అట్టహాసంగా కేక్ కటింగ్

నెల్లూరు (వైద్యం), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ కష్టకాలంలో పార్టీని అండగా నిలిచారని టీడీపీ నాయకులు వెల్లడించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కేక్ కట్ చేసి నేతలకు తినిపించారు. బాణాసంచా కాల్చి నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పేరుతో గత ఎన్నికలలో పార్టీలో నూతన ఉత్తేజాన్ని రేకెత్తించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టారని కొనియాడారు. వారసత్వం పేరుతో వ్యవస్థలను తప్పుదోవ పట్టించకుండా ఒక సిస్టంతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. రెడ్‌బుక్ తెరచి తప్పు చేసిన వారికి గుణపాఠం చెప్పవలసిందేనని అన్నారు. ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్రానికి అమూల్య నాయకుడిలా లోకేష్ మారబోతున్నారని వెల్లడించారు. ఒక అనుభవమైన లెజెండ్ లీడర్ నాయకత్వంలో లోకేష్ పనిచేస్తున్నారని తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్‌ను హోప్ ఆఫ్ ది ఆంధ్రప్రదేశ్‌గా ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో లోకేష్ చిరస్థాయిగా నిలుస్తారం టూ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత లు కంభం విజయరామి రెడ్డి, చేజెర్ల వెంకటే శ్వరరెడ్డి, జెడ్ శివప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ అజీజ్‌కేక్ తినిపిస్తున్న సోమిరెడ్డి, పక్కన కోటంరెడ్డి తదితరులు

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం

- 'ఉల్లాస్'పై శిక్షణలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (హరనాథపురం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే ఉల్లాస్ కార్యక్రమ ఉద్దేశమని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఉల్లాస్ కార్యక్రమం అమలుపై ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ ఏపీఎంలకు, వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించి, వారికి అక్షర జ్ఞానం కల్పించేందుకే ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అభ్యాసకులంతా కేంద్రాలకు వచ్చి అక్షరాలు నేర్చుకునేలా చూడాలని డీఆర్‌డీఏ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవోలు ఈ కార్యక్రమ పురోగతిని పరిశీలించాలన్నారు. వయోజనవిద్య డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మహమ్మద్ ఆజాద్ మాట్లాడుతూ జిల్లాలో పొదుపు సంఘాల్లోని 19,178 మంది నిరక్షరాస్యులను గుర్తించి, వారికి ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలు, వీడియో పాఠాల ఆధారంగా అక్షరజ్ఞానం కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం వయోజనవిద్యకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శిక్షకులు శైలజ, మస్తాన్‌రెడ్డి, నారాయణరావు, రాజ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

## 1 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి): సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజా నాట్య మండ లి రూపొందించి సీడీని గురువారం ఆయన నెల్లూరు లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తర్వాత నెల్లూరులో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో ఫిబ్రవరి 1,2,3వ తేదీల్లో ఈ సభలు జరుగుతాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పార్టీ నేతలు పాల్గొంటారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు చంద్రా రాజగోపాల్, మంగళం పుల్లయ్య, ప్రసాద్, రెహనా బేగం, మోహన్‌రావ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహా సభల సీడీని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

## ఆ అధికారం స్థానిక సంస్థలదే!

(5వ పేజీ తరువాయి)

మున్సిపాలిటీలకు బదలాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**నూతన విధివిధానాలు ఇవే..**

- ఇప్పటివరకూ కొన్ని రకాల భవనాలకు మాత్రమే మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీల పరిధిలో అనుమతులు జారీ చేసే అధికారం ఉండేది. 500 చదరపు మీటర్లు దాటిన భవనాలకు నుడా నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ఇకపై అన్ని రకాల భవనాలకు, 500 చదరపు అడుగుల విస్తీర్ణానికి మించినవి కూడా నుడా పరిధిలోకి రావు. వీటన్నిటికీ కార్పొరేషన్ లేదా ఆయా మున్సిపాలిటీలే అనుమతులు జారీ చేస్తాయి. నగర పంచాయతీల్లో మాత్రం గ్రూప్ డెవలప్‌మెంట్ పథకం కింద నిర్మించే ఇళ్లు, హైరైస్ బిల్డింగ్‌లు మినహాయించి మిగిలిన అన్ని భవనాలకు అనుమతులు మంజూరు చేసే అధికారం ఇచ్చారు. ఈ రెండు కేటగిరీలకు మాత్రం డీటీసీపీ అనుమతులు ఇస్తుంది. ఇక పంచాయతీలకు 300 చదరపు అడుగులు లేదా పది మీటర్ల ఎత్తు భవనాల వరకూ అనుమతులు ఇచ్చే అధికారం కల్పించారు. అంతకుమించితే నుడా పరిధిలోకి వస్తుంది.
- అర్బన్ డెవలప్‌మెంట్ చట్టం ప్రకారం అన్ని రకాల లేఅవుట్లకు ఇప్పటివరకూ నుడా అనుమతులు మంజూరు చేస్తూ ఉండేది. ఇకపై నెల్లూరు కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో వేసే లేఅవుట్లకు ఆయా స్థానిక సంస్థలే అనుమతులు ఇస్తాయి. నగర పంచాయతీల పరిధిలో మూడు ఎకరాల్లోపు వేసే లేఅవుట్లకు అక్కడే అనుమతులు మంజూరు చేస్తారు. అంతకుమించితే డీటీసీపీ దగ్గర అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీల్లో వేసే లేఅవుట్లు మాత్రం నుడా పరిధిలోనే ఉంటాయి. అదేవిధంగా అప్రూవ్డ్ లేఅవుట్లలోని ప్లాట్లను సబ్ డివిజన్ చేసే బాధ్యత కూడా ఆయా కార్పొరేషన్, మున్సిపాలిటీలకే అప్పగించారు.
- అనధికార లేఅవుట్లు, భవనాలపై పర్యవేక్షణ బాధ్యతలను కూడా మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాచయతీలకు అప్పగించారు. అక్రమంగా లేఅవుట్లు వేసినా, అనుమతులకు విరుద్ధంగా భవనాలు నిర్మించినా వాటిని ఎప్పటికప్పుడు తనఖీ చేస్తూ నోటీసులిచ్చే అధికారం వాటికి కల్పించారు. ఇప్పటి వరకూ లేఅవుట్లు, పెద్ద భవనాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారం నుడాకు ఉండేది.

### ఉత్తర్వులు అందాయి

లేఅవుట్లు, భవనాలకు అన్ని రకాల అనుమతులను మున్సిపాలిటీ ఇచ్చే విధంగా ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆన్‌లైన్‌లో దానికి సంబంధించి ఇంకా మార్పులు చేయలేదు. అది చేయగానే మేమే అనుమతులు మంజూరు చేస్తాం.

- జీ శ్రావణ్‌కుమార్, కావలి కమిషనర్

## రెడ్‌క్రాస్ చైర్మన్‌గా విజయకుమార్ ఎన్నిక

(5వ పేజీ తరువాయి)

అంగీకారం తెలపడంతో ఆయన ఎన్నికయినట్లు డీఆర్‌వో ప్రకటించారు. మొత్తం 15 మంది ఉన్న సభ్యుల్లో ఐదుగురిని కలెక్టర్ ఆనంద్ తొలగించడంతో మిగిలిన 10 మంది సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే సభ్యుడు సురేష్‌కుమార్ జైన్ అందుబాటులో లేకపోవడంతో 9 మంది సభ్యులు మాత్రమే పాల్గొన్నారు. కలెక్టర్ ఆనంద్ నూతన చైర్మన్ ఎన్నికయినట్లు ప్రకటన కూడా విడుదల చేయటంతో రెడ్‌క్రాస్ కార్యాలయంలో సంబరాలు జరిగాయి.

- **సభ్యుల తొలగింపుపై హైకోర్టు స్టే**

రెడ్‌క్రాస్‌లో ఐదుగురు సభ్యుల తొలగింపుపై గురువారం హైకోర్టు స్టే విధించింది. మాజీ చైర్మన్ పర్వతరెడ్డి పెంచలరెడ్డితోపాటు మలిరెడ్డి కోటారెడ్డి, నేతాజి సుబ్బారెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులను పాలకవర్గం నుంచి కలెక్టర్ ఆనంద్ ఇటీవల తొలగించారు. వీరంతా హైకోర్టును ఆశ్రయించడంతో మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు జారీ చేసింది. రెడ్‌క్రాస్ ప్రాథమిక సభ్యత్వంతోపాటు సభ్యులుగా కొనసాగించాలని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. అయితే నూతన చైర్మన్ ఎన్నిక ఆపాలని హైకోర్టును కోరగా ఇందుకు 14 రోజుల తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు తెలియచేసింది.

## బాలికల విద్య.. భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

- తల్లికి వందనం మే నుంచి అమలు
- ఎమ్మెల్యేతో కలిసి పెదపవని బాలికల గురుకులం తనిఖీ
- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి

లింగసముద్రం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్య, భద్రత, ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. గురువారం మంత్రి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి పెదపవని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి కొందరు విద్యార్థినులతో సౌకర్యాల గురించి ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం బాత్‌రూంలు, మరుగుదొడ్లు పరిశీలించి ప్రిన్సిపాల్ స్నేహలతపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉండే డార్మిటరీని, డైనింగ్ హాలును పరిశీలించి 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడి కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు.

**● పేద పిల్లలు.. గొప్పగా ఎదగాలి**

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పేద పిల్లలు సమాజంలో గొప్పగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి లక్ష్యమన్నారు. బాలిక అంటే వధువు కాదని చదువని చెప్పారు. తల్లికి వందనం ఈ ఏడాది మే నుంచి అమలు చేస్తామన్నారు. గురుకులాల్లో డిగ్రీ కోర్సుతో పాటు టెక్నికల్ కోర్సులు తీసుకొస్తామన్నారు. అనంతరం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. పాఠశాలను ఇంత పెద్ద విస్తీర్ణంలో పాఠశాలను నడపడంపై అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ స్నేహలత, టెలికం అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్ మాల్యాద్రి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సాంబయ్య, మాజీ సర్పంచు నాయబ్‌రసూల్, సోంపల్లి మనోహర్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి, పక్కన ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

## మా ఊళ్లో మైనింగ్ వద్దు!

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో మంజూరుచేసిన మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తూర్పురొంపిదొడ్ల గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. సర్వే నంబరు 230-1లోని 10.20 ఎకరాల మేత పోరంబోకు భూమిలోని 9.50 ఎకరాల్లో మైనింగ్



క్వార్ట్జ్, మైకా తవ్వకాలు సాగించేందుకు 2021లో ఓ కాంట్రాక్టరు అనుమతులు పొందారు. ఇటీవల కాంట్రాక్టరు అర్ధరాత్రి సమయంలో తవ్వకాలు సాగిస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకొని అడ్డుకోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. మరోమారు అలాంటి ప్రయత్నాలు చేయకూడదనే ఉద్దేశంతో తాజాగా తవ్వకాలు సాగించిన గుంతలను పూడ్చివేసి నినాదాలు చేశారు. అనంతరం వాహనాలు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా రహదారికి అడ్డుగా గుంతను తీసి నిరసన కొనసాగించారు. గతంలో అడ్డుకున్నప్పటికీ మరలా పనులు చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తుండడం దారుణమని మండిపడ్డారు. ఆప్రాంతం సమీపంలోనే నివాసాలు ఉండగా ప్రస్తుతం ఆలయం నిర్మిస్తున్న తరుణంలో పనులు జరిగితే తమతో సహా మూగజీవాలు, పిల్లల ప్రాణాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులలో పనులను చేపట్టేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకొనే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

## సీఆర్పీఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

కలిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాను లింగుంటి వెంకట నరసయ్యకు(36) తెల్లపాడులో గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. ప్రజలు భారీగా తరలివచ్చి వీరజవాన్‌కు నివాళులర్పించారు. వెంకటనరసయ్య పార్థివ దేహాన్ని సీఆర్పీఎఫ్ అధికారులు న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక వాహనంలో గురువారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద నివాళులు అర్పించి, అనంతరం స్వగృహానికి తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీ





వెంకటనరసయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

లకతీతంగా రాజకీయ నాయకులతోపాటు మండలవాసులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామస్థులే పాడెను మోసి పార్థివదేహాన్ని శ్మశానికి తరలించారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపగా అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ వెంకట నారాయణ ఎస్ఐ ఉమాశంకర్ అంత్యక్రియల ఏర్పాట్లు సుజావుగా జరిగేందుకు భద్రత ఏర్పాట్లు చేశారు. వెంకట నరసయయ్య పార్థివదేహాన్ని చూసి కన్న తల్లిదండ్రులతోపాటు భార్య యశ్విత, పిల్లలు శ్రీనికేత్, విశ్వాంత్ తల్లడిల్లిపోయారు. కన్నీరుమున్నీరవుతున్న వారిని సముదాయించడం ఎవరివల్ల కాలేదు. అధికారులతోపాటు గ్రామస్థులు వారిని అక్కున చేర్చుకొని ఓదార్చారు.



# సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం

- 45 నుంచి 90 శాతం వరకు రాయితీ
- బిందు, తుంపర్ల సేద్య పరికరాలు
- రైతువాటా చెల్లింపుల్లో జాప్యం
- 31న ప్రత్యేక డ్రైవ్

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో ఉత్పాదకత పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. రైతులకు రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించింది. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవడం కూడా జరిగింది. వారికి అవసరమైన బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించిన పరికరాలను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అయితే రాయితీ పరికరాల కోసం ముందుగా చెల్లించాల్సిన రైతు వాటా బ్యాంకుల్లో చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. దీనిపై ఈనెల 31వతేదీన ప్రత్యేక డ్రైవ్ కూడా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**● 45 నుంచి 90శాతం వరకు రాయితీ**

ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) ఆధ్వర్యంలో బిందు, తుంపర్ల సేద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. అందులో భాగంగా చిన్న, సన్నకార రైతులకు 45 శాతం నుంచి 90 శాతం రాయితీపై అవసరమైన పరికరాలను అందజేస్తోంది.



బిందు సేద్య పరికరాన్ని పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు(ఫైల్)

2024-25 సంవత్సరానికిగాను 92వేల హెక్టార్లలో దీనిని అమలు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. పరికరాల సరఫరాకు 9 కంపెనీలను ఎంపిక చేసింది. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఉన్న అన్ని ఉద్యాన, వ్యవసాయ, కూరగాయ పంటలు, పూలతోటలు, చెరకు, ఆయిల్‌పామ్, మల్బరీ, మిరప మొదలైన పంటలకు ఈ పథకం వర్తిస్తుంది. అదేవిధంగా నీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు సొంత భూమి కలిగి ఉన్న రైతులు, ఏడేళ్ల రిజిస్టర్ కౌలు ఒప్పందపత్రం కలిగిన రైతులు కూడా అర్హులు. బిందు సేద్యానికి సంబంధించి ఐదెకరాల పొలం కలిగిన రైతులకు 90 శాతం రాయితీ ద్వారా రూ.2.18లక్షల వరకు సబ్సిడీ పొందవచ్చు. అదేవిధంగా 5 నుంచి 10 ఎకరాల లోపు రైతులకు 70 శాతం రాయితీ ద్వారా రూ.3.46లక్షల వరకు సబ్సిడీ పొందవచ్చు. తుంపర్ల సేద్యానికి సంబంధించి 2.5ఎకరాల పొలం ఉన్న రైతులకు 55శాతం రాయితీ ద్వారా 30 పైపులు, 5 స్ప్రింక్లర్లు అందుతాయి. 2.5 నుంచి 5 ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 55శాతం రాయితీ ద్వారా 41పైపులు, 9 స్ప్రింక్లర్లు అందుతాయి. 5 నుంచి 10ఎకరాలలోపు రైతులకు 45శాతం రాయితీ ద్వారా రైతుల కోరిక మేరకు 30 పైపులు, 5 స్ప్రింక్లర్లు, లేదంటే 41 పైపులు 9 స్ప్రింక్లర్లు అందుతాయి.

**● బిందు సేద్యంతో నీటి ఆదా**

బిందు సేద్యం వల్ల నూరుశాతం నీరు ఆదా అవుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగుచేసుకోవచ్చు. అంతేకాకుండా ప్రతి మొక్కకు నీరు సమానంగా అందుతుంది. మొక్కలకు అవసరమైనంత తేమ అందించడం ద్వారా బాగా పెరుగుతాయి. 45 నుంచి 50శాతం వరకు విద్యుత్ ఆదా కూడా అవుతుంది. ఎరువుల వృథాను అరికట్టవచ్చు. కలుపు తక్కువగా ఉంటుంది. దీంతో కూలీల ఖర్చులు బాగా తగ్గుతాయి. నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

**● ప్రాథమిక సర్వే పూర్తి**

ఏపీఎంఐపీ పథకం ద్వారా బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించి జిల్లాలో రైతులు దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 8620 మంది దరఖాస్తు చేసుకున్నారు. 4723 హెక్టార్లకు సంబంధించి 3879 మంది రైతులకు ప్రాథమిక సర్వే కూడా పూర్తయింది. అందులో 2615 హెక్టార్లకు సంబంధించి 2213 మంది రైతులు వారి వాటాను చెల్లించారు. మిగిలిన రైతులు చెల్లించాల్సి ఉంది. దీనికోసం ఈనెల 31వతేదీన రైతులకు అవగాహన కల్పించడంతోపాటు రైతు వాటా కట్టించేందుకు అధికారులు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నారు.

### రాయితీలను సద్వినియోగం చేసుకోండి

● ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు(ఏపీఎంఐపీ)కి సంబంధించి ప్రభుత్వం అందచేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రాజెక్టు పీడీ బీ. శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిందు, తుంపర్ల పరికరాలకు దరఖాస్తు చేసుకుని, సర్వే పూర్తి చేసుకున్న రైతులు వారి వాటా చెల్లించి పరికరాలు పొందుతున్నారని తెలిపారు. అయితే 1,444 మంది రైతులు ఇంకా వారి వాటా చెల్లించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి రైతుల వాటా చెల్లించేలా ప్రోత్సహించేందుకు ఈనెల 31న ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ పర్యవేక్షణలో వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొంటారని పేర్కొన్నారు. రైతు వాటా చెల్లింపులు నగదు రూపంలో కాకుండా ఆర్‌టీజీఎస్ ద్వారా, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఖాతాకు నేరుగా బదిలీ చేయనున్నట్లు తెలిపారు.

## నకిలీ పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

సీతారామపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దేవిశెట్టిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన రైతులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దేవిశెట్టిపల్లె గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 92-1,92-2,92-3,92-4,92-5, 92-6కి సంబంధించి 9-45 సెంట్లు, 86-1లో 2.50 సెంట్లు భూమికి సంబంధించి 20 సంవత్సరాలుగా పట్టాలు, పాసుపుస్తకాలు పొంది సాగు చేసుకుంటున్నామని తెలిపారు. కాగా, మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కొంత మంది మా భూములకు నకిలీ పట్టాలు సృష్టించారని 2024 మార్చిలో జిల్లా కలెక్టరుని కలిసి ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి ఈ విషయమై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవోని ఆదేశించారు. దీంతో అప్పటి ఆత్మకూరు ఆర్‌డీవో ఏప్రిల్ 2024న నకిలీ పట్టాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కానీ ఇంతవరకు నకిలీ పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోలేదని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్నామని రైతులు తెలిపారు.



ఆందోళన చేస్తున్న రైతులు

## శీనానాయక్‌కు బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

నెల్లూరు (హరనాథపురం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ వీకే.శీనానాయక్‌కు 2024 బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు వచ్చింది. ఈ మేరకు చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సిటీ ప్లానర్ దేవీకుమారి, బీఎల్‌వోలు వై.హజరత్‌బీ, కే నాగార్జునకు కూడా అవార్డులు లభించాయి. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరికి అవార్డులు ప్రకటించారు. ఈనెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నారు.

## అడవి పందిని ఢీకొని బైక్ బోల్తా : ఇద్దరికి గాయాలు

సంగం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అడవి పందిని ఢీకొని బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని సంగం - కలిగిరి రహదారిలో గురువారం ఉదయం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్‌పేట మండలం పాతనాపురం గ్రామానికి చెందిన రాహుల్, శ్రీనివాసులు చేజర్ల మండలం ఓబులాయపల్లికి బేల్దారి పనికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యంలో సంగం సమీపంలో పొలాల్లో నుంచి రోడ్డు దాటుతున్న అడవి పందిని బైక్ ఢీకొని బోల్తా పడడంతో బైక్ నడుపుతున్న రాహుల్‌కు స్వల్ప గాయాలు కాగా, వెనుక కూర్చున్న శ్రీనివాసులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో నెల్లూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించి, పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మూడు పొగాకు బ్యారన్లలో
## అగ్నిప్రమాదం

● రూ. 6లక్షల ఆస్తి నష్టం

మర్రిపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాడులో గురువారం మూడు పొగాకు బ్యారన్లలో అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ. 6లక్షల ఆస్తినష్టం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. భూమా రత్నారెడ్డి, భూమా ఓబులమ్మ, భూమా రామలక్ష్మమ్మలకు చెందిన మూడు బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ అవుతున్న సమయంలో పైనుంచి ఆకు రాలి పొగ గొట్టంపైన పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో రైతులు అగ్నిమాపక సిబ్బంది కి సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

## అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు



పొదలకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గుంట సమీపంలో గురువారం సాయంత్రం ఓ కారు చెట్టును ఢీకొంది. రాపూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. అదృష్టవశాత్తు కారు నడుపుతున్న శ్రీనివాసులు అనే వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది. కారు చెట్టును ఢీకొన్న శబ్దం విని చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న వారు వచ్చి డ్రైవింగ్ సీట్‌లో ఇరుక్కుపోయిన శ్రీనివాసులు బయటకు తీశారు.

## చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడి అరెస్టు

● రూ.6 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైం), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వరుస దొంగతనాలకు పాల్పడుతూ, తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్థుడిని గురువారం నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.6 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వివరాలను నగర డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పీ సింధుప్రియ దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యతో కలిసి వెల్లడించారు. నెల్లూరు నగరంలోని కొండాయపాలెం గేటు సమీపంలోని ఓల్డ్ మిలటరీ కాలనీలో రామ్మోహన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 13న వారు ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత, సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాల మేరకు నిందితుడు నెల్లూరు వనంతోపు రామకృష్ణనగర్‌కి చెందిన జీ సునీల్‌గా గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ జీ రోశయ్య పర్యవేక్షణలో ఎస్ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం కొండాయపాలెం గేటు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా ఓల్డ్ మిలటరీ కాలనీతోపాటు దర్గామిట్ట పరిధిలో గతేడాది మరో మూడు చోట్ల చోరీలు చేసినట్లు నిందితుడు అంగీకరించడంతో అతడ్ని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.6 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుడు ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ వ్యసనాలకు బానిసై దొంగగా మారాడని ఆమె తెలిపారు. అతడిపై ఇప్పటికే నెల్లూరులో 9 కేసులు ఉన్నాయని చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకునేందుకు కృషి చేసిన దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది మహేంద్రనాద్‌రెడ్డి, ఖాజారహంతుల్లా, శ్యామూల్, వేణు, తదితరులను డీఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

## 54.470 కేజీల గంజాయి పట్టివేత

● నలుగురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

వెంకటాచలం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద గురువారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పీ దయసాగర్ ఆదేశాల మేరకు నెల్లూరు - 2 ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో విశాఖపట్టణం నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులో తనిఖీలు నిర్వహించగా నలుగురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లుగా గుర్తించారు. వారి వద్ద ఉన్న 5 బ్యాగులను పరిశీలించగా వాటిలో 9 గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. తమిళనాడుకు చెందిన వనిత, లతా, పెరుమాళ్ళ వేలు, గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన ఇమ్మనేయెల్ రాజు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 54.470 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు వివిధ కోణాల్లో విచారించగా విశాఖపట్టణంలోని గాజువాక ప్రాంతానికి చెందిన కుమారేశన్ అనే వ్యక్తి సదరు గంజాయిని తిరుపతిలోని ముత్తులక్ష్మికి ఇవ్వాల్సిందిగా నలుగురు వ్యక్తులకు గంజాయి ఇచ్చి పంపించినట్లు విచారణలో నిందితులు వెల్లడించారు. నలుగురు వ్యక్తుల నుంచి మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ పీ అనిత, ఎస్ఐ సయ్యద్ కాలేషా వలి, హెడ్ కానిస్టేబుల్ ఎం కిరణ్ సింగ్, కానిస్టేబుళ్లు కే పెంచలయ్య, వీ తులసీదాస్, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు

### పిచ్చికుక్క దాడిలో
### 12 మందికి గాయాలు



మర్రిపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో 12 మందికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని మర్రిపాడులో గురువారం ఉదయం చోటుచేసుకుంది. గాయపడిన వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరగా, వారికి చికిత్స చేసి, తీవ్ర గాయాలైన ఇద్దరిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించినట్లు డాక్టరు గోపీనాథ్ తెలిపారు. గాయపడిన వారిలో ముగ్గురు పెద్దవారు కాగా మిగిలిన వారంతా చిన్నపిల్లలు. గంట వ్యవధిలోనే 12 మందిపై పిచ్చికుక్క దాడి చేయడంతో రోజు మొత్తం పిల్లలను బయటకు రానివ్వకుండా గ్రామస్థులు బిక్కు బిక్కు మంటూ గడిపారు. స్థానికుల చేతిలో ఆ కుక్క సాయంత్రం మృతిచెందింది.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 138 |
| లేయర్ లైవ్ | 85 |
| స్కిన్ చికెన్ | 246 |
| స్కిన్‌లెస్ | 270 |
| లేయర్ | 145 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.7745 |
| వెండి కిలో ధర | రూ. 93,200 |
| వెండి ఒక గ్రాము | రూ.96.20 |

# ఈఎస్ఐలో మందుల కొరత

- గత వైసీపీ పాలనలో నిధులివ్వని ప్రభుత్వం
- అరకొర మందులతో కార్మికుల అవస్థలు
- కృష్ణపట్నంలో వైద్యకేంద్రం నిరుపయోగం
- మెరుగుపరిస్తే వేల మందికి ప్రయోజనం

**వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన వైద్యాన్ని అందించాల్సిన ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు ఏడాదికేడాదికి దిగజారుతున్నాయి. ఈఎస్ఐ ఆసుపత్రి నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 75 శాతం నిధులు విడుదల చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద 25 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్లు నిధులు విడుదల చేయకపోవటంతో నెల్లూరులోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో మందులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. అంతే కాదు ఉన్న మందుల్లోనూ చాలా వరకు నాసిరకమైనవని, వాటినే రోగులకు ఇవ్వాల్సి వస్తోందని ఆసుపత్రి వైద్యులే చెబుతుండటం గమనార్హం.**

నెల్లూరు (వైద్యం), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) డిస్పెన్సరీ ఉంది. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ వైద్యశాల కార్మికుల ఆరోగ్య సంరక్షణలో ఎంతో పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం ఇక్కడ ముగ్గురు వైద్యులు, సిబ్బంది ఉన్నప్పటికీ తీవ్రమైన మందుల కొరవ వేధిస్తోంది. తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి కొద్ది మొత్తంలో మందులు తీసుకువచ్చి నెట్టుకొస్తున్నారు. కానీ, పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పటం లేదు. క్రమంగా వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే కార్మికుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. జిల్లాలోని పరిశ్రమల్లో సుమారు 25 వేల మంది వరకు కార్మికులు ఉన్నారు. నెల్లూరు ఈఎస్ఐ డిస్పెన్సరీలో పూర్తిస్థాయి సదుపాయాలు, మందులు లేకపోవడంతో కార్మికులకు వైద్యపరంగా ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే తిరుపతిలోని ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది.

**గతమెంతో ఘనం**

ఈఎస్ఐ ఆసుపత్రిలో ఒకప్పుడు సాధారణమైన జ్వరం, ఒళ్లునొప్పులు, బీపీ, షుగర్ వ్యాధులకు మందులతోపాటు ఖరీదైన మందులూ అందుబాటులో ఉండేవి. మనిషి ఎదుగుదలకు ఉపయోగపడే రూ.25వేల హార్మోన్ ఇంజక్షన్లు, కేన్సర్ వ్యాధికి వినియోగించే రూ.60వేలకుపైగా విలువ చేసే ఇంజక్షన్లు, మందులు ఉండేవి. కార్మికులు ఎక్కువగా చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతుంటారు కావున వాటికి సంబంధించినవి, కీళ్ల నొప్పులకు, గాయాలకు ఆయింట్‌మెంట్లు, మాత్రలు మెరుగైన కంపెనీలవి ఇచ్చేవారు. దాదాపు 300 రకాల మందులు అప్పట్లో ఈఎస్ఐ ఆసుపత్రి ఉండేవి. ప్రస్తుతం సుమారు 100 రకాలు మాత్రమే ఉంటున్నాయి. దీంతో విధిలేని పరిస్థితిలో వైద్యులు మందుల చీటి రాసిచ్చి బయట కొనుక్కోమని చెబుతున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గతంలో ఈఎస్ఐ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం చేయించుకున్నప్పుడు ఆ ఖర్చులను ప్రభుత్వం రీయింబర్స్ చేసేంది. కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో అది అమలుకాలేదనే ఆరోపణలున్నాయి.



నెల్లూరులోని ఈఎస్ఐ డిస్పెన్సరీ

**కృష్ణపట్నంలో వైద్యుల కొరత**

పరిశ్రమలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కృష్ణపట్నం వద్ద ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేశారేగానీ వైద్యులు, సిబ్బందిని నియమించ లేదు. దీంతో ఆ ఆసుపత్రి భవనానికి అద్దె రూపంలో వేల రూపాయలు ఖర్చు చేసి ప్రస్తుతం మూసివేశారు. ఆ వైద్యశాల పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే స్థానిక పరిశ్రమల్లోని కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతున్నాం**

ఈఎస్ఐ ఆసుపత్రిలో కొంత కాలంగా మందుల కొరత ఉన్నమాట వాస్తవమే. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నాం. అత్యవసర మందులు తిరుపతి నుంచి తెప్పిస్తున్నా అవి కార్మికులకు సరిపోవటం లేదు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ కొన్ని మందులను పంపించింది. వాటిలో ఏమేమి ఉన్నాయో పరిశీలిస్తాం. గతంలో వలే ఈఎస్ఐ ఆసుపత్రిని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతాం. కార్మికులకు అండగా ఉండి వైద్య సేవలను విస్తరిస్తాం.

- డాక్టర్ సువర్ణలత, ఈఎస్ఐ ఆసుపత్రి హెడ్

## న్యూస్ బాక్స్

### ఉచిత పశువైద్య శిబిరం

కందుకూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మోపాడు, నరిశెట్టివారిపాలెంలో మండల పశువైద్యాధికారి ఎస్.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. గేదెలు, దూడలకు డీవార్మింగ్ సిబ్బంది మందులు తాగించటంతో పాటు గర్భకోశవ్యాధులున్న పశువులు, ఎదకు రాని వాటిని పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల సహాయ సంచాలకులు చంద్ర మోహన్ పాల్గొన్నారు.

### విద్యుత్ అదాలత్‌కు నాలుగు అర్జీలు

అల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమానికి నాలుగు అర్జీలు మాత్రమే వచ్చాయి. ఈ సమస్యలను ఉన్నతాధికారులు పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, జీఎం రామ్‌మోహన్‌రావు, నెల్లూరు ఎస్‌ఏవో మురళి, ఈఈ ఎస్.బెనర్జీ, డిప్యూటీ ఈఈ ఎం.రవిచంద్ర, ఏఈ మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

### డీఎల్పీవో విచారణ

బిట్రగుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యాలయంలో ఐదు నెలల క్రితం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో పెట్టిన విషయంపై డీఎల్పీవో రాధా మాధవీలత గురువారం విచారణ చేపట్టారు. సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వచ్చిన లేఖపై టీడీపీ, జనసేన నాయకులతో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ విషయమై టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బోగోలు ఇన్‌చార్జి ముంతాల వెంకయ్యలను విచారించారు. ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

### ఆరోగ్యంపై నిర్లక్ష్యం వీడాలి

దగదర్తి, (బిట్రగుంట) జనవరి 23 (ఆంధ్రజ్యోతి):ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యంను వీడాలని నెల్లూరు నారాయణ హాస్పిటల్ వైద్యులు లహరి రెడ్డి తెలిపారు. ప్రిన్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు శీరామాపురం సాయిబాబా మందిర ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 152మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 40మందినిగుర్తించి ఉచిత ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచు నాగమణి, సుమ, అసోసియేషన్ అధ్యక్షుడు ఇండ్ల కృష్ణయ్య, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, వీఆర్వో నాగరాజు, కార్యదర్శి సునీత ఉన్నారు.

### పశు వైద్య శిబిరం

కొండాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భీమవరప్పాడులో గురువారం పశు వైద్య శాఖ అధికారులు గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శాయిపేట పశువైద్యుడు మధు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దూడలు, పెద్ద పశువులకు నట్టల నివారణ మందును తాపించారు. పశువులకు గర్భకోశ పరీక్షలు, వ్యాధి నివారణ ఇంజక్షన్లు వేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు శ్రీధర్‌రావు, టెక్నికల్ పశువైద్యులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

### పారిశుధ్యానికి పెద్దపీట

సంగం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ పేరుతో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆత్మకూరు డీఎల్‌పీవో నారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన సంగం మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ప్రసాదు, పంచాయతీ సెక్రటరీ నరసయ్య పాల్గొన్నారు.

### వ్యక్తి అరెస్టు

బిట్రగుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెల్లగుంట క్రాస్‌రోడ్డుపై సంపంగి వెంగయ్య అనే వ్యక్తి వద్ద దౌర్జన్యం చేసి రూ.5వేలతో పరారైన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్ఐ భోజ్యం గురువారం రాత్రి తెలిపారు. నెల 19న రాత్రి వెంగయ్య మద్యం సేవించి తిప్పసెంటర్‌లో ఉన్నాడు. ఈ సమయంలో తిప్ప గ్రామానికి చెందిన సముద్రాల క్రాంతి అక్కడకు వచ్చి బెదిరించి అతని వద్ద ఉన్న నగదును లాక్కెల్లాడు. బాధితుడి ఫిర్యాదు విచారణ చేపట్టగా విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.



# వేళకు రాని ఆర్టీసీ బస్సులు

- 2కిలోమీటర్ల దూరంలో మోడల్ స్కూల్
- కొండాపురం, కావలి మార్గాల విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఇళ్లకు వెళ్లేటపుడు ప్రమాదకర ప్రయాణం

కలిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని ఏపీ మోడల్‌స్కూల్, జడ్పీ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థుల సంఖ్య 1,005 మంది. ఏపీ మోడల్ స్కూల్ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పాఠశాలలకు కలిగిరి మండలం నుండే కాకుండా ఏఎస్ పేట, కొండాపురం మండలాల గ్రామాల నుండి బస్సులు, ఆటోల్లో రావాల్సి ఉంది. దూరప్రాంత విద్యార్థులు పాఠశాలలకు రావాలన్నా.. పాఠశాల నుండి ఇంటికి చేరుకోవాలన్నా ఆర్టీసీ బస్సులో తప్పనిసరి అయ్యింది. అయితే కావలి, కొండాపురం మార్గాల్లో విద్యార్థులు కలిగిరి తహసీల్దారు కార్యాలయం వరకు మాత్రమే వస్తారు. అక్కడనుండి పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళలో రావడానికి కొంతమేర అవకాశం ఉన్నా, సాయంత్రం వేళలో ఇంటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడతారు. ఈ మార్గంలో నెల్లూరు నుంచి పామూరు వెళ్లే బస్సులు తిరుతుంటాయి. పాఠశాలకు రావడానికి ప్రత్యేక బస్సు లేకపోవడం, ఉదయం, సాయంత్రం వేళలో బస్సులు రద్దీగా ఉండటం, కొన్నిబస్సులు ఆపకపోవడంతో వేళకు ఇళ్లకు చేరుకోలేక పోతున్నారు.

#### రెండు బస్సులు మారాలి..

ఏపీ మోడల్‌స్కూల్‌కి వచ్చే విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. హసనాపురం, వింజమూరు మార్గాల నుండి వచ్చే విద్యార్థులకు పామూరు బస్సుల్లో నేరుగా వచ్చే అవకాశం ఉంది. కొండాపురం, కావలి మార్గాల నుండి వచ్చే విద్యార్థులు రెండు బస్సులు మారాల్సి వస్తుంది. బస్సు సిబ్బంది దయా దాక్షిణ్యాలమీద ఆధారపడి విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులను పరిమిత సంఖ్యలో ఎక్కాలని కోరుతున్నా బస్సు సిబ్బంది మాటలను విద్యార్థులు లెక్క చేయకుండా ఇంటికి చేరుకోవాలనే నెపంతో వేలాడుతూ ప్రమాద కరంగా ప్రయాణిస్తున్నారు. అవసరమైన సమయంలో తగినన్ని బస్సులు లేక పోవడం, వచ్చిన ఒక్క బస్సులో వీపుకి బ్యాగులు తగిలించుకొని ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణం చేస్తుంటారు. ఈ దృశ్యాలను చూసిన ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురిఅవుతున్నారు.


ఆర్టీసీబస్సు ఎక్కుతున్న విద్యార్థులు

### బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

సంగం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనతిప్పకు చెందిన ఓ బాలిక ఈనెల 19వ తేదిన ఇంట్లో అలిగి వెళ్లింది. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### జడ్పీటీసీ ఆగ్రహం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) (ఆంధ్రజ్యోతి):మూడు నెలలకు ఒకసారి జరిగే కీలక సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు డుమ్మా కొట్టడంపై జడ్పీటీసీ సభ్యులు రావిళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వెల్ఫేర్, అటవీ అధికారులు గైర్హాజరయ్యారు.

# యువగళం పాదయాత్రతో ప్రజల్లో విశ్వాసం

- కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి
- ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదినం
- కందుకూరు వేడుకల్లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

కావలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువ నాయకుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రతో పార్టీపై ప్రజల్లో విశ్వాసం నింపాడని, ఆయన్ను బావి ముఖ్యమంత్రిగా చేసి.. పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల ను పార్టీ నాయ కులు, కార్యకర్తలు పండుగలా నిర్వహించారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలబడి మంత్రి లోకేష్ మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు. టీడీపీ సభ్యత్వాలు కోటికిపైన జరిగాయంటే అది లోకేష్ కృషి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

- బిట్రగుంట: స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకలో పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరావు కేక్ కట్ చేసి తమ నేతకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుధీర్ బాబు, వెంకయ్య, వెంకటేశ్వరరెడ్డి, నాగరాజు, వేంకటేశ్వర రెడ్డి, సుబ్బారావు, రామోహన్‌రెడ్డి, రంగయ్య, షైదిహర్ష, అశోక్ నాయుడు ఉన్నారు.
- కొండాపురం: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలినేని రమేష్, చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, వి.మణి పాల్గొన్నారు.
- కందుకూరు: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఎమ్మెల్యే ఇంటూరితో కలిసి స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో ఎమెల్యేతో కలిసి కేకు కట్ చేశారు. కుట్టుశిక్షణలోని మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. గత ఎన్నికల ముందు పాదయాత్రతో శ్రమించిన లోకేష్ బాబు కృషి మరువలేనిదన్నారు. అలాగే అన్న క్యాంటీన్‌లో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, వేముల గోపాలరావు, జనిగర్ల నాగ రాజు, మాదాల లక్ష్మీనరసింహ ఉన్నారు.
- ఆత్మకూరు: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో నేతలు కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రా వెంకటసుబ్బానాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, సాగునీటి సంఘం చైర్మన్ మాదాల మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.
- సంగం: స్థానిక బంగ్లా ఆవరణలో టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండ లాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, సంగం పంపింగ్ స్కీమ్ అధ్యక్షుడు షేక్‌బాబు, హరిరెడ్డి పాల్గొన్నారు.
- అనంతసాగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. అనంతరం బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులకు ప్లేట్లు, గాస్లులు, ఉన్నత పాఠశాలలో ప్యాడ్‌లు అందజేశా రు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్య క్రమంలో ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి, మునగపాటి సునీత, శాఖమూరి సుబ్బారావు, రాపూరు సుబ్బారెడ్డి, కమ్మ ప్రభాకర్ నాయుడు, చల్లా శివారెడ్డి, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి: రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌బాబు యువగళం పాదయాత్ర చేపట్టి రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకలో నాయకులతో కలిసి 43 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, బొజ్జా నరసింహులు, కలివెల జ్యోతి, నల్లిపోగు నరసింహ, సందానీ, సజిల్, రెడ్డిబత్తిన వెంకటేశ్వర్లు, నరసింహ పాల్గొన్నారు.

- దుత్తలూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో నేతలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.
- వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): అధికార పార్టీకి చెందిన ఇరువర్గీయులు పోటా పోటీగా వేడుకలు నిర్వహించారు. మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. మరో వర్గానికి చెందిన గొ[illegible] మాలకొండ్రాయుడు, మాజీ జడ్పీటీసీ, పీఏసీఎస్ అధ్యక్షులు భోగినేని శ్రీనివాసులు, కామేపల్లి వెంకటరత్నం, ఆంధ్రా బాలగురవారెడ్డి తదితరులు పాఠశాలల్లో కేకులను కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.
- సీతారామపురం: బస్టాండ్ సెంటర్‌లో జరిగిన వేడుకలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ కలివెల జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జిల్లా బీసీ కార్య నిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్‌సీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి జాషువా, జనసేన యువ నాయ కుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధి) పాల్గొన్నారు.
- చేజర్ల: స్థానికంగా జరి గిన వేడుకలో జిల్లా టీడీపీ పార్ల మెంట్ సెక్రటరీ రావి పెంచలరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రావి లక్ష్మీనరసారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రావి కృష్ణారెడ్డి, హజరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కావలి: మలిశెట్టికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే


కందుకూరు: కేక్ కట్ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే


ఆత్మకూరు: కేక్ కట్ చేస్తున్న నేతలు, కార్యకర్తలు


సంగంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


అనంతసాగరం- కేక్ కట్ చేస్తున్న నాయకులు


కొండాపురం: కేకును తినిపిస్తున్న నాయకులు


బిట్రగుంట: తెలుగు తమ్ముళ్ల సంబరాలు

### ఇండోర్ స్టేడియం నిర్మాణానికి నిధుల మంజూరు

కావలి టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మినీ స్టేడియం మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ2.64లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. కావలి క్రికెట్ అసో సియేషన్ ఆధ్వర్యంలో 20రోజులుగా మినీ స్టేడియం మైదానంలో జరుగుతున్న డివిజన్‌స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని విజేతలకు ట్రోఫీలు చెక్కులను అందజేశారు. మినీ స్టేడియం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే దివంగత మాగుంట పార్వతమ్మ స్వీయ నిధులతో ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, మాజీ కౌన్సిలర్ మదన్‌మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- కావలి: కలెక్టర్ ఆనంద్ ఈ నెల 28న పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. వెంగళరావు నగర్‌లోని ప్రాథ మిక ఆరోగ్యకేంద్రం భవనం పరిశీలించి, ప్రా రంభోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు. కొత్త శివాలయం నుంచి ఇందిర మ్మ కాలనీ, రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి మీదుగా వెళ్లే రోడ్డు ప్రాం తాన్ని, శిథిలావస్థ ఉర్దూ ఘర్ షాదీఖానా, వంటేరు వరదారెడ్డి పార్క్‌ను పరిశీలించారు.

### నిందితులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో

కలువాయి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వెరుబొట్లపల్లికి చెందిన దళిత యువకులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ గురువారం కలువాయిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కేసులో దళిత యువకులపై నమోదు చేసిన కౌంటర్ కేసును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. బస్టాండు సెంటర్‌లోని పొదలకూరు-సోమశిల రోడ్డుపై గంట పాటు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ నిలిపోయింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, మందా పెంచలయ్య మాదిగ, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్ మాదిగ, మండల నాయకులు పాల్గొన్నారు.

### తాగునీటి క్లోరినేషన్ తప్పనిసరి

కావలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ తెలిపారు. గురువారం అన్నగారిపాలెం సమగ్ర మంచినీటి సరఫరా పథకాన్ని తనిఖీ చేసి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ట్యాంకులను 15రోజులకు ఒకసారి శుభ్రపర్చటంతో పాటు ప్రతిరోజూ క్లోరినేషన్ చేయించాలన్నారు. 45 గ్రామాలకు తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా అని ఆరా తీశారు. నీటి పరీక్షల శాంపిల్స్ పరిశీలించారు. తాగునీటి సరఫరాలోని ఎయిర్‌వాల్స్ లీకేజీతో నీరు వృథా అవుతున్న విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ గోళ్ల సుప్రియ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రెడ్డయ్య, డీఈ లీలా ప్రకాష్, ఏఈ సతీష్, కార్యదర్శి అబ్దుల్ సమద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### రహదారి భద్రత.. సామాజిక బాధ్యత

కందుకూరు, (ఆంధ్రజ్యోతి):రహదరి భద్రత సామాజిక భద్రత అని సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన వాక్‌దాన్ కార్యక్రమంలో పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం నుంచి పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఏరియా హాస్పిటల్ వరకు రహదారి భద్రత ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరు ప్రాంతీయ రవాణా అధికారి టీవీఎన్ నాగలక్ష్మి, ఎంవీఐ సీ హెచ్ రాంబాబు, కావలి ఏఎంవీఐ లక్ష్మీబాయి, వి వేకా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్

### ట్రంకు రోడ్డుకు మాగుంట పార్వతమ్మ పేరు

కావలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకు రోడ్డుకు.. మాగుంట పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ట్రంకురోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరణ చేయడంలో అప్పటి ఎమ్మెల్యేగా మాగుంట పార్వతమ్మ కృషి చేసింది. ఆమె మరణానంతరం ఆమె పార్థివ దేహానికి నెల్లూరులో నివాళులర్పించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కావలి ట్రంకు రోడ్డుకు మాగుంట పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపటంతో రాష్ట్ర ప్రభుత్వం పంపడంతో మాగుంట అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### నాణ్యమైన ఉత్పత్తులపై దృష్టి

వలేటివారిపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పొగాకుపై రోజురోజుకు పెరుగుతున్న ఆంక్షలు, తరిగిపోతున్న మార్కెట్ దృష్ట్యా రైతులు నాణ్యమైన పొగాకు ఉత్ప త్తులపై దృష్టి సారించాలని కందుకూరు పొగాకు వేలం కేంద్రం నిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం అమ్మపాలెంలో నిర్వహించిన పొగాకు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. పొగాకు రైతులకు ఎన్‌టీఆర్‌ఎం బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోర్డు సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### నష్టపరిహారం అందించాలి

సీతారామపురం, జనవరి 23 (ఆంధ్ర జ్యోతి): మైదుకూరు - సింగరాయ కొండ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మారం రెడ్డిపల్లి, గుండుపల్లి వద్ద స్థలాలు, గృహాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని నిరసన వ్యక్తం చేశారు. పరిహారం చెల్లించకుండా గృహాలు కూల్చడం ఏమిటని అడ్డుకున్నారు.

### వేడుకల ప్రారంభం

కందుకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడా వేడుకలను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో భాస్క రరావు, బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల భాస్కర్, నరేంద్రబాబు పాల్గొన్నారు.

### స్క్రీనింగ్ సర్వే తనిఖీ

ఉదయగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఇందిరా నగర్ కాలనీలో డబ్ల్యూహెచ్‌వో ఆదేశాల మేరకు గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యఆరోగ్య సిబ్బంది నిర్వహించిన ఎన్ సీడీ స్క్రీనింగ్ సర్వేను ఎన్‌సీడీసీడీ పరిశీలన అధికారి వాసవి తనిఖీ చేశారు. కార్యక్రమం లో వైద్యాధికారిణి వినీత, సీహెచ్‌వో శివకు మారి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### సన్మానం

ఉదయగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్కనగిషీ కేంద్రంలో నిర్వాహకులు గౌసియా బేగం, జాకీర్ హుస్సేన్‌లతోపాటు ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హాజరయ్యే అవకాశం దక్కించుకున్న సందానీ, షాహీన్ దంపతులను గురువారం టీడీపీ నాయకులు సన్మానించారు. కార్య క్రమంలో పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్, బయ్యన్న, రియాజ్, రవీంద్రబాబు ఉన్నారు.

# ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి


నివాళులర్పిస్తున్న రామ్‌సెంటర్ బాధ్యులు

కావలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, నేతలు పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి బాబూరావు పాల్గొన్నారు.

#### రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో..

అడవిరాజుపాలెం పాఠశాలలో డాక్టర్ రామ్‌సెంటర్ సభ్యులు నిర్వహించిన వేడుకలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

- అనంతసాగరం: కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరదేవి, ఉపాధ్యాయులు చెరుకూరి మనోజ్‌కుమార్, వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కేసీ విక్రమ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

### వీర జవాన్‌కు ఘన నివాళి

వింజమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కలిగిరి మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన లింగుంట వెంకటనరసయ్య ఢిల్లీలో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందగా స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కన్స్యూమర్ రైట్స్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చేబ్రోలు వసంతరావు జాతీయ జెండాని జవాన్‌పై కప్పి ఘనంగా నివాళి అర్పించారు.

### టీచర్ భారతికి డాక్టరేట్

ఆత్మకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న వేలూరు భారతికి యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వైవియు తెలుగు శాఖ ఆచార్యులు రామప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో ఒక శతాబ్దపు రాయలసీమ కథానిక - స్త్రీ (1962 నుండి నేటి వరకు) అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. భారతిని యుటిఎఫ్ నాయకులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గంగాధర్, శివప్రసాద్‌రావు, షేక్ ఖాదర్‌బాష, పి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## దోమలపై దండయాత్రలో భాగస్వాములు కండి


మురికి గుంతల్లో ఆయిల్ బాల్స్ వదులుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 23,(ఆంధ్రజ్యోతి): దోమలపై దండయాత్రలో నగరవాసులంతా భాగ స్వాములు కావాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 34వ డివిజన్ ప్రగతినగర్ బీ బ్లాక్ వద్ద మురికిగుంతల్లో ఆయన ఆయిల్ బాల్స్ వదిలారు. అనంతరం మాట్లాడుతూ శుక్రవారం నుంచి రూరల్ నియోజ కవర్గ పరిధిలోని 26 డివిజన్లలో అధికారులు దోమల నివారణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నా రని తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొ ని, తమ నివాసాల వద్ద ఉన్న డ్రైనేజీ కాలువల్లో కిరోసిన్, లేదా అయిల్‌బాల్స్ వేయాలని కోరారు. 26 డివిజన్లలో ఫాగింగ్ చేయడం, ఆయిల్ బాల్స్ కిరోసిన్, గంబూజీయా చేపలను వదలే ప్రక్రియ ప్రతిరోజూ జరుగుతుందన్నారు.

## వ్యాపారులందరికీ ట్రేడ్ లైసెన్సు ఉండాలి : కమిషనర్

నెల్లూరు(సిటీ), జనవరి 23,(ఆంధ్రజ్యోతి): వ్యా పారం చేసే ప్రతిఒక్కరికి విధిగా ట్రేడ్ లైసెన్సు ఉం డాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. గురువారం డైకస్‌రోడ్డు వద్దనున్న చేపలు, మటన్ మార్కెట్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్లలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి, మరింత మె రుగుకు సూచనలిచ్చారు. ఇక్కడ వ్యాపారం చేసేవా రంతా ట్రేడ్ లైసెన్సు తీసుకునేలా సచివాలయం, కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్ల ఆక్రమణలు లేకుండా, రహదారులపై ఫ్లెక్సీలు, బోర్డులు పెట్టకుండా స్థానిక సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐజీ, డీఆర్ ఆదేశిస్తేనే నిషేధిత జాబితాలోకి..

● బుచ్చి సబ్ రిజిస్ట్రార్ కోటేశ్వరమ్మ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ, జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాలు లేకుండా బ్లాక్ లిస్టు లే అవుట్లను నిషేధిత జాబితాలో పెట్టబోమని బుచ్చి సబ్ రిజిస్ట్రార్ ఎల్లసిరి కోటేశ్వరమ్మ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన బ్లాక్ లిస్టులో 19 లే అవుట్ల విష యంపై సబ్ రిజిస్ట్రార్‌ను అడుగ్గా నుడా నోటీసులు ఇచ్చింది వాస్తవమే అని తెలిపారు. కానీ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ, జిల్లా రిజిస్ట్రారు ఉత్తర్వులు వస్తేనే చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త జీఓ నెంబరు 3 ప్రకారం నగర పంచాయతీలో లే అవుట్లకు అనుమతులు ఇవ్వాల్సింది 3ఎకరాల విస్తీర్ణంలోపు లే అవుట్లకు నగర పంచాయతీ, అంతకు మించితే రిజిస్ట్రేషన్ శాఖ గుంటూరు టౌన్ ప్లానింగ్ రీజియనల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి అనుమతులు పొందాలన్నారు. కొత్త రూల్స్ ప్రకారం నుడా ప్రమేయం వుంటుందా అని ప్రశ్నిస్తే జిల్లావ్యాప్తంగా గత రూల్స్ ప్రకారం నుడా పంపించిఉంటుందన్నారు.

### ఎంఎస్ఈ సర్వే పరిశీలన

కోవూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎంఎస్ఈ సర్వే గురువారం కోవూరు, ఇనమడుగు, లేగుంటపాడు గ్రామాల్లో జరిగింది. ఈ సర్వేను ఎంపీడీఓ శ్రీహరి రెడ్డి పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ఎక్కువ మందికి చేరేలా ఈ సర్వే చేపట్టినట్లు వివరించారు. సచివాలయాల, పంచాయతీల సిబ్బంది పారదర్శకంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

### భావితరాలకు వేమన సాహిత్యం అందించాలి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 23:(ఆంధ్రజ్యోతి): భావితరాలకు వేమన సాహిత్యాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం సుజాత అన్నారు. గురువారం పాఠశాలలో వేమన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించి వేమన ఫౌండేషన్ అందజేసిన జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, పతకాలు ప్రదానం చేసి అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా రిసోర్సు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### హుండీ లెక్కింపు

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం వీధిలోని పోలే రమ్మ ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు ఆలయ ఈవో ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.హుండీలో మొత్తం రూ.30,233 వచ్చినట్లు గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

## ఏపీని ఐటీ హబ్‌గా మార్చేందుకు లోకేష్ కృషి


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి


రాపూరులో నేతల సంబరాలు

నెల్లూరు(విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశ, విదేశాల నుంచి పరిశ్రమలను తీసుకువచ్చి రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. లోకేష్ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. అనంతరం కేక్‌లు కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా లోకేష్ సేవలందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్‌లు, టీడీపీ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో...**

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి 42 కేజీల కేక్‌కట్ చేశారు. అలాగే మండలంలోని కందమూరులో నిర్వహిస్తున్న గడప గడపకు... కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి 42 కేజీల కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో నారా లోకేష్ ఆరోగ్య సురక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీ అఖండ విజయానికి లోకేష్ కృషి**

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేశారని ఆ పార్టీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు తెలిపారు. గురువారం నగరంలోని గుప్తాపార్క్ వద్ద లోకేష్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. పిల్లల చేత కేక్ కట్ చేయించి పంచి పెట్టారు. మాజీ కార్పొరేటర్ సుజాతరావు ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్, పార్టీ నేతలు చెంగయ్య ఆచారి, కల్యకుంట్ల భాస్కర్, రాజ, మురళీరెడ్డి, మునిశేఖర్, వెంకటేశ్వర్లు, సిద్ద కళాచారి, అద్దంకి చంద్ర, కంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం: పెద్దూరులోని సౌత్ స్కూల్‌లో మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి భర్త కొండదరామిరెడ్డి గురువారం నారా లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక యువకులు పాల్గొన్నారు. బుచ్చి టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, నాయకులు హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, శివరామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరనాథ్, రామానాయుడు, మల్లి, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు: స్థానిక పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్దఎత్తున పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఊటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో టీడీపీ నాయకులు రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనంతోపాటు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో తాటిపర్తి సుధాకర్, చలంచర్ల కామేశ్వరమ్మ, భవాని, కొండారఘు, ఎల్లంటి సుబ్బారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కోవూరు : నారా లోకేష్ జన్మదిన వేడుకల్ని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయంలో టీడీపీ, తెలుగు యువత, నారా లోకేష్ సేవా సమితి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేకు కట్ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇంతా మల్లారెడ్డి, సూరిశెట్టి శ్రీనివాసులు, బెల్లంకొండ విజయకుమార్ పాల్గొన్నారు.

● పొదలకూరు : నారా లోకేష్ జన్మదిన వేడుకలను పొదలకూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ బస్టాండు ఆవరణలో కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో జరగ్గా కోవూరు బక్కయ్యనాయుడు, బోగోలు భాస్కర్‌రెడ్డి, కలగట్ల సందీప్, జడపల్లి సూర్య, వెంపులూరు అరుణమ్మ, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, బ్రహ్మదేవి చంద్ర, అమర్తలూరు చెంచయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●రాపూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాపూరు మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎన్. వెంకటరమణారెడ్డి, డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.


పొదలకూరులో కేక్ కటింగ్


పిల్లలకు కేక్ తినిపిస్తున్న సుబ్బారావు


బుచ్చి వేడుకల్లో పాల్గొన్న నేతలు



### ముందస్తు గణతంత్ర వేడుకలు

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఊటుకూరు పల్లిపాలెం తీర ప్రాంతమైన పాతపాల దిబ్బ, జీలుగుల దిబ్బలో గురువారం కోస్ట్‌గార్డు, మెరైన్ పోలీసులు ముందస్తు గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోస్ట్‌గార్డు, మెరైన్ సీఐ ప్రసాద్, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, స్థానిక ఎస్ఐ నరేష్‌కుమార్, మత్స్యకార నాయకులు ఆవుల వాసులు జాతీయ జెండాను ఎగుర వేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు.

## సాంకేతిక మార్పులపై రైతు కూలీలకు అవగాహన


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక మార్పులపై రైతు కూలీలకు అవగాహన కల్పించి తద్వారా వారి జీవనోపాధిని పెంపొందించే అవకాశాలు ఉన్నాయని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 3,4, సామాజిక సమరసత వారి సంయుక్త ఆధ్వర్యంలో భూమిలేని రైతు కూలీల సామాజిక ఆర్థిక స్థితిగతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ విజయభాస్కర్‌రావు విచ్చేశారు. తొలుత నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రైతు కూలీలకు ఉపయోగపడే దిశగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కే పరుశురామయ్య, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, కోడూరు సత్యం, కే కేశవులు, జయప్రకాష్ తదితరులున్నారు.

### వీసీని కలిసిన ఏపీటీడీసీ ఈడీ

మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో గురువారం వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావును ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమణప్రసాద్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించి పలు అంశాలపై చర్చించారు.

## డీఎస్పీని కలిసిన సీనియర్ సిటిజన్లు


నగర డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీనియర్ సిటిజన్లు

నెల్లూరు(క్రైం), జనవరి 23 (ఆంధ్రజ్యోతి):కొత్తగా బాధ్యతలు చేపట్టిన నగర డీఎస్పీ పీ సింధుప్రియను భారత్ సేవా ఫౌండేషన్ సభ్యులు, సీనియర్ సిటిజన్లు గురువారం డీఎస్పీ కార్యాలయంలో కలిసి సత్కరించి, ఆక్సిజన్ మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి ఎస్‌కే ఖాసీం మాట్లాడుతూ "సీనియర్ సిటిజన్లు వారి సమస్యలు తెలుపుకునేందుకు అధికారులను కలవలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఎస్పీ చొరవ చూపి డయల్ యువర్ డీఎస్పీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, టోల్ ఫ్రీ నెంబరును ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎం రత్నం, రమణరాజు, ఏవీ రావు, నారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

### గాజు గ్లాసు గుర్తింపుపై సంబరాలు


సంబరాల్లో జనసేన నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టీ గ్లాసును పార్టీ గుర్తుగా ఎంపిక చేశారని, ఆ గుర్తు పార్టీ సొంతం అయిందని ఆ పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ పేర్కొన్నారు. గాజు గ్లాసు గుర్తింపుపై నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న జనసేన జిల్లా కార్యాలయంలో గురువారం నాయకులు సంబరాలు చేశారు. భారీ కేక్‌ను కట్‌చేసి, కేక్, స్వీట్లు ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, సుజయ్ బాబు, రవి, జమీర్, పవన్‌యాదవ్, మునిగిరీష్, తదితరులు పాల్గొన్నారు.

### జడ్పీ పాఠశాలలో బాలికా దినోత్సవం

నెల్లూరు(విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార సహాయకులు పీ.హరికృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాలికలకు ఎన్నో పథకాలను అందిస్తోందని, వీటిని సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు జయప్రకాష్, న్యాయవాది రమాదేవి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి యోగా శిబిరం


విలేకరులతో మాట్లాడుతున్న బాలాజీ యోగాచార్య తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కస్తూర్బా హైస్కూల్ మైదానంలో శనివారం నుంచి సోమవారం వరకు ఉచిత సమీకృత యోగా శిబిరం నిర్వహించనున్నట్లు పతంజలి యోగపీఠ్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ యోగాచార్య తెలిపారు. గురువారం నగరంలోని రామ్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ శిబిరంలో ఆరోగ్యానికి సంబంధించి యోగాచికిత్స ప్రాణాయామాలు, నేచురోపతి, ఆయుర్వేదం, యజ్ఞథెరపీ, ప్రకృతిపై అవగాహన కోసం శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణకు శిబిరంలోనే పేర్లు రిజిస్టర్ చేసుకోవచ్చని తెలపారు. కార్యక్రమంలో భారత స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు బీ.విజయకుమార్‌రెడ్డి, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.పెంచలయ్య, ముత్యాల రవీంద్ర, తదిత రులు పాల్గొన్నారు.

### ఘనంగా నేతాజీ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 23 (ఆం ధ్రజ్యోతి) : నగరంలోని క్రాంతినగర్ ఎంసీ యూపీ పాఠశాల, దర్గామిట్ట పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం కోమల కృష్ణయ్య, ఉపాధ్యాయులు జయలక్ష్మి, గౌసియా బేగం, సుజాత, బషీర్, రఘురామయ్య పాల్గొన్నారు.





## సర్పంచుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శ


పిచ్చయ్యనాయుడు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, తదితరులు

మనుబోలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహపురం పంచాయతీ సర్పంచు కడియాల సునీల్‌నాయుడును గురువారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల సునీల్‌నాయుడు తండ్రి పిచ్చయ్య నాయుడు అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో పిచ్చయ్యనాయుడు కర్మక్రియలకు ఎమ్మెల్యే హాజరై ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సునీల్‌నాయుడును, కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాడసానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణమనాయుడు, మురళీనాయుడు, మధునాయుడు, మధునాయుడు, శ్రీధర్‌రెడ్డి, వెంకురెడ్డి, రాఘవరెడ్డి, వెంకటరమణారెడ్డి, చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

### తప్పిదాలు లేకుండా రీసర్వే నిర్వహించాలి

మనుబోలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తప్పిదాలు లేకుండా రీసర్వే నిర్వహించాలని తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. పిడూరులో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని గురువారం తహసీల్దార్ క్షేత్ర పరిశీలన చేశారు. రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఎ ఈ కార్యక్రమంలో రీసర్వే డీటి మంజుల, సర్వేయర్ శ్రీనువాసులు, విఆర్‌వో శ్రీనువాసులు, సర్వే అసిస్టెంట్లు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-2వ డిపో పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సమస్యలు, విలువైన సూచనలు అందించేందుకు శుక్రవారం(నేడు) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎం శివకేశవ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఫోన్ చేసి సూచనలు,సమస్యలు తెలియచేయాలన్నారు. ఇందుకోసం 99592 25642 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి


నరుకూరు సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

తోటపల్లిగూడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ నేతలు సహకరించాలని ఎస్ఐ వీరేంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని నరుకూరు సెంటర్‌లో గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ తోటపల్లిగూడూరు మండలంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఆయా గ్రామ నేతలు సహాయ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో శరత్‌బాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కొత్తపాలెంలో పశు వైద్య శిబిరం

తోటపల్లిగూడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామని పశు వైద్య అధికారి షఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు, కోడూరు పశు వైద్యులు డాక్టర్ నరేష్, లైవ్ స్టాక్ ఆఫీసర్ షఫీ, ట్రెయినీ డాక్టర్స్, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### శ్మశానంలో దహన వాటిక ఏర్పాటు

పొదలకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన శ్మశాన వాటికలో పొదలకూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తన్నీరు వెంకటకృష్ణయ్య ధర్మపత్ని హాజరత్తమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.2లక్షల50వేలతో నూతనంగా రెండవ దహన వాటికను నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా దహన వాటిక శిలాఫలకాన్ని జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గౌతమ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గౌతమ్, పట్టణ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తన్నీరు సాయిచందు, పట్టణ ఆర్యవైశ్య సోదరులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు నిర్మాణంపై నాణ్యతా పరీక్షలు


నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పత్తేఖాన్‌పేట మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు మూడు రోజులు నుంచి జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని స్థానికులు నగర పాలక సంస్థకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు గురువారం నగర పాలక సంస్థ ఏఈ సమక్షంలో క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, క్వాలిటీ తనిఖీలు నిర్వహించి, శ్యాంపిళ్లను తీసుకు వెళ్లారు.


నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

## సామూహిక సూర్య నమస్కారాలు

తిరుపతిలోని ఎస్వీయూ తారకరామ స్టేడియంలో గురువారం సామూహిక సూర్యనమస్కార కార్యక్రమం నిర్వహించారు. స్వామి వివేకానంద, నేతాజీ జయంతి సందర్భంగా వివేకానంద కేంద్ర- ఎస్వీయూ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. వేలాదిగా హాజరైన నగర ప్రజలు, విద్యార్థుల చేత సూర్య నమస్కార ఆసనాలు వేయించారు. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి





# ఆ అధికారులపై విచారణ పూర్తి

- ప్రభుత్వం చేతిలో కార్పొరేషన్ అధికారుల చిట్టా
- నివేదిక సమర్పించిన ఆర్డీ
- ఇక చర్యలే తరువాయి

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాల చిట్టా రాష్ట్ర ప్రభుత్వం చేతికి వెళ్లింది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగంతో పాటు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొట్టారని విచారణ కమిటీ గుర్తించినట్టు తెలిసింది. మంత్రి నారా లోకేశ్‌కు వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్ (డీఎంఏ) విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో ఏర్పాటైన విచారణ కమిటీ దాదాపు మూడు నెలలపాటు సుదీర్ఘ విచారణ అనంతరం రూపొందించిన నివేదికను ఆర్డీ విశ్వనాథ్ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి విభాగం ఉన్నతాధికారులకు ఇటీవల సమర్పించారు. కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్‌గాను, అకౌంటెంట్‌గా పనిచేసిన చిట్టిబాబుతో పాటు డీఈగా పనిచేసిన విజయకుమార్‌రెడ్డి పనితీరుపై లోతైన విచారణ జరిగింది.రెవెన్యూ పరిపాలన వ్యవహారాల అంశాలలో పెద్దఎత్తున అవినీతి జరిగినట్టు గుర్తించినట్టుగా తెలుస్తోంది. కార్పొరేషన్లో అవకతవకలు జరిగినట్టు ఇదివరకే ప్రీ ఆడిట్ కమిటీ తేల్చిన అంశాల ఆధారాలపైనే విచారణ కమిటీ ప్రధానంగా దృష్టిపెట్టినట్టు సమాచారం. టెండరుకు వెళ్లి చేయాల్సిన పనులు నామినేటెడ్ కింద ఇవ్వడం, అనర్హులకు టెండర్లను కట్టబెట్టడం, బడ్జెట్ ఒకింత ఇస్తే రెండింతలు ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టడం. లేని అధికారాలు చెలాయించి దుర్వినియోగం చేయడం వంటివి విచారణ కమిటీ నివేదికలో ఉన్నట్టు సమాచారం. అదేవిధంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిర్మాణాల కొలతలకు, రికార్డులో నమోదు చేసిన కొలతల్లో చాలా వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించినట్టు తెలుస్తోంది. అడ్డగోలుగా కొలతలు తగ్గించడం, పార్కింగ్ వేయాల్సిన చోట వేయకుండా పన్నులు తగ్గించడం వంటివి బయటపడినట్టు సమాచారం. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలోనూ విజయకుమార్ రెడ్డి పై విచారణకు నియమితులైన పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు విచారణ నివేదిక ఇంకా ప్రభుత్వానికి చేరకపోయినప్పటికీ ఆర్డీ నేతృత్వంలోని కమిటీ డీఈ అక్రమాలను కూడా గుర్తించి నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం.

### ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపు

జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో స్నాక్స్ కోసం రూ.33 లక్షల బిల్లులు చెల్లింపు జరిగినట్టు గుర్తించారు. రెండు బిల్లులుగా ఆ మొత్తాన్ని ఓ ఈవెంట్ కాంట్రాక్టర్‌కు ముట్టజెప్పినట్టు తెలిసింది. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చుపెట్టిన అంశాలను కూడా నివేదికలో పొందుపరిచనట్టు తెలుస్తోంది. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారిణి హరిత పేరును కూడా నివేదికలో చేర్చినట్టు సమాచారం. నివేదికను పరిశీలించిన తర్వాత వీరిపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం సిద్ధపడుతున్నట్టు తెలుస్తోంది.

### రవినాయుడు ఫిర్యాదుపై కదిలిన డొంక

గత వైసీపీ నేతలతో అంటకాగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాప్ చైర్మన్ రవినాయుడు ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ మేనేజర్‌గా ఉన్న వీఎస్ చిట్టిబాబు, ఆర్వో కేఎల్ వర్మపై విజిలెన్స్ విచారణ చేపట్టి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో చిట్టిబాబు వైసీపీకి కొమ్ముకాస్తూ కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఇబ్బందిపెట్టడంతో పాటు, ప్రలోభాలకు గురిచేశారని, గత సార్వత్రిక ఎన్నికల్లోనూ భూమన అభినయ్‌కు ఓట్లు వేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారని లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టించడంలోనూ సిద్ధహస్తుడని వెల్లడించారు. ఇక ఆర్వో కేఎల్ వర్మ పన్నులు విధించడంలో ఇష్టానుసారంగా వ్యవహరించారని, వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తొత్తుగా వ్యవహరించి పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా గత ప్రభుత్వంలో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారని పేర్కొన్నారు. కుప్పం స్థానిక ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా వెళ్లి అక్కడా పెద్దిరెడ్డి చెప్పినట్టు చేశారని ఆరోపించారు. కార్పొరేషన్ ఆర్వోగా అనేక అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కాంట్రాక్టు పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలలోనూ, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్‌కు కాంట్రాక్టర్ల నుంచి నిధులు దోచిపెట్టడంలో డీఈ విజయకుమార్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఫైళ్లా... ఇస్తాంలే!

- విజిలెన్సుకు తుడా అధికారుల సహాయ నిరాకరణ
- అక్రమాలపై ముందుకు సాగని విచారణ



తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో ఇంకా వైసీపీ వాసనలు పోలేదు. అక్రమాలపై దర్యాప్తు కోసం విజిలెన్సు అధికారులు ఫైళ్లు అడుగుతుంటే సహాయ నిరాకరణ చేస్తున్నట్లు తెలిసింది. దీంతో విజిలెన్సు విచారణ ముందుకు సాగడంలేదు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వ హయాంలో తుడా పరిధిలో అడ్డగోలు టెండర్లతో అయినవారికి పనులు కట్టబెట్టారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా 2020-21లో 54 పనులకు సంబంధించి రూ.20 కోట్లు విలువ చేసే టెండర్లను పిలిచారు. 2021-22లో రూ.139 కోట్లు విలువ చేసే దాదాపు 400 పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. 2022లో రూ.475 కోట్లు విలువ చేసే 157 పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. తమకు సంబంధించిన వారికి పనులు కట్టబెట్టి అడ్డగోలుగా నిధులు దోచుకున్నారనే అభియోగాలు బలంగా ఉన్నాయి. కొన్ని పనులకు టెండర్ల దాఖలుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఏకంగా నామినేషన్ ప్రాతిపదికన పనులు కట్టబెట్టారన్న విమర్శలున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. తుడా నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ లోటు బడ్జెట్ చూపడం పట్ల పలు అనుమానాలకు దారితీస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి నేరుగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో ఆయన విజిలెన్సు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో విజిలెన్సు అధికారులు రంగంలోకి దిగారు. సంబంధిత ఫైళ్లు అప్పగించి విచారణకు సహకరించాలని తుడా అధికారులను కోరారు. అదిగో, ఇదిగో అంటూ కాలం గడుపుతున్నారే కానీ, దర్యాప్తునకు అవసరమైన ఫైళ్లు ఇవ్వలేదని, ఈ దిశగా తుడా అధికారులు సహకరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆదేశాలు వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఆ ఫైళ్లను అప్పగించడంలో అధికారులు మీనమేషాలు లెక్కపెట్టడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయన్న చర్చ సాగుతోంది. ఈ విషయమై విజిలెన్సు అధికారులు పదేపదే రిమైండర్లు పంపుతున్నా పట్టించుకోవడంలేదని విశ్వసనీయంగా తెలిసింది. రెండు మూడు రోజుల్లో ఫైళ్లు అప్పగించకుంటే విజిలెన్సు డీజీకి ఫిర్యాదు చేయడానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం.



కలెక్టర్ వెంకటేశ్వర్ - ఎస్పీ హర్షవర్ధనరాజు - భాగ్యలక్ష్మి

# కలెక్టర్, ఎస్పీలకు బెస్ట్ ఎలక్టోరల్ అవార్డులు

- మరో ఐదుగురూ ఎంపిక
- రేపు విజయవాడలో పురస్కారాల ప్రదానం

తిరుపతి/, తిరుపతి(నేరవిభాగం), జనవరి23(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను ఎన్నికల సంఘం గుర్తించి గురువారం అవార్డులు ప్రకటించింది. 2024లో జరిగిన ఎన్నికల్లో వీరి పనితీరును ప్రాతిపదికగా తీసుకుని ఎంపిక చేసింది. వీరిలో కలెక్టర్ వెంకటేశ్వర్, అప్పటి ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు వీరికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రత్యేక కేటగిరీ అవార్డుకు తిరుపతి అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మిని ఎంపిక చేశారు. ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఎన్నికలను సమర్థంగా నిర్వహించడమే కాకుండా సమస్యాత్మకమైన తిరుపతి జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడాన్ని కలెక్టర్, ఎస్పీ సేవలను రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వలన పోలింగ్‌లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు నిర్వహించిన తీరుపై ఈసీ ప్రశంసించింది. వైసీపీ హయాంలో తిరుపతి నియోజకవర్గంలో జరిగిన స్థానిక, ఉప ఎన్నికలపై దొంగ ఓట్ల జాతర జరిగిన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు నిర్వహించిన ఏఈఆర్వో భాగ్యలక్ష్మి ఎంపికయ్యారు. ఇక, వెంకటగిరి నియోజకవర్గం ఈఆర్వో సుధారాణినీ ఎంపిక చేశారు. ఉత్తమ బీఎల్వోలుగా జ్యోతి (తిరుపతి), పార్వతి (సత్యవేడు), సాంకేతిక సహకారం అందించిన తేజపవన్(తిరుపతి) కూడా అవార్డులకు ఎంపికయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 25న జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వీరికి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

## జేఈఈ మెయిన్స్‌కి 2285 మంది హాజరు

తిరుపతిరూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌కు రెండవరోజు గురువారం 2285మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని సిటీకోఆర్డినేటర్ టికైలాష్‌నాథ్ పేర్కొన్నారు. 2322మంది విద్యార్థులకు గాను 2285మంది హాజరవ్వగా..37మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు.



తిరుపతిలో టీడీపీ శ్రేణుల ఉత్సాహం

## ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

జిల్లాలో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలిపిరి, తిరుమలలో టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కేకులు కట్ చేశారు. ఇంకొన్ని చోట్ల ర్యాలీ నిర్వహించారు. ఇలా టీడీపీ శ్రేణులు సందడి చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమార్కులు వేసిన రోడ్డు - ఆ రోడ్డు మీదుగా ట్రాక్టరులో తరలిస్తున్న ఇసుక

## ఇసుక అక్రమ రవాణాకు రాచబాట

ఏర్పేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది ప్రాంతంలో ఇసుక తరలించడానికి అక్రమార్కులు రాచబాట వేసుకుంటున్నారు. మూడు నెలల కిందట ఇలా రోడ్డు వేసి రాత్రింబవళ్లు ట్రాక్టర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి కందకాలు కొట్టి స్వర్ణముఖి నదిలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజులు ఆగిన అక్రమార్కులు.. రెండు రోజుల నుంచి దర్జాగా స్వర్ణముఖి నదిలో ఎక్సకవేటర్ల సాయంతో ఇసుకను తరలించడానికి ఏకంగా రాచబాట వేసుకున్నారు. మళ్లీ ఇసుక తరలిస్తున్నారు. దీనిపై స్థానికులు శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవికి ఫోనులో ఫిర్యాదు చేశారు. 'సమస్య మా దృష్టికి వచ్చింది. ఇసుక అక్రమ రవాణా కోసం స్వర్ణముఖి నదిలోకి ప్రవేశించడానికి వీల్లేకుండా కందకాలు తవ్విస్తాం' అని తహసీల్దారు భార్గవి తెలిపారు.

## శ్రీవారి ఆలయంలో ముగిసిన అధ్యయనోత్సవాలు



తిరుమల, జనవరి23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో గత నెల 30న మొదలైన అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా రంగనాయక మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని వేంచేపు చేసి దివ్యప్రబంధ గోష్ఠి నిర్వహించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా తిరమలనంబి స్మృత్యర్థం గురువారం 'తన్నీరుముదు' ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తర్వాత మలయప్పస్వామి వాహన మండపానికి వేంచేపు చేశారు. తిరుమలనంబి వంశీకులు బిందెలతో ఆకాశగంగ తీర్థాన్ని వాహన మండపానికి తీసుకువచ్చారు. అక్కడ వేదమంత్రోచ్చారణ నడుమ జీయర్ స్వాములు, ఆచార్య పురుషులు, ప్రబంధ పండితులు పవిత్ర తీర్థజలంతో ఆలయంలోకి వేంచేపు చేశారు. మూలవిరాట్టు పాదాలపై అమరిఉన్న బంగారు తొడుగుకు పవిత్ర ఆకాశగంగ జలంతో అభిషేకం చేశారు. ఈసందర్భంగా నంబి రచించిన 'తిరుమొళి పాశురాలను' పారాయణం చేశారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

● రూ.20 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

పెళ్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట కొందరి తీరుతో ఓ యువకుడు మోసపోయారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం అర్థమాలకు చెందిన తాండవ కృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వర్క్ ఫ్రమ్‌హోమ్ చేస్తున్న ఈయన కొందరి సూచన మేరకు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టారు. సుమారు రూ.20లక్షల నగదును పోగొట్టుకున్నారు. దీనిపై మరో రూ.11 లక్షలు కట్టి వీఐపీ ఖాతా ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తే మొత్తం నగదు ఇస్తామని వారు చెప్పడంతో అనుమానం వచ్చి ఎస్‌ఐ నాగరాజును ఆశ్రయించారు. ఇది సైబర్ నేరంగా గుర్తించి.. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీహరి సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**మంగళవారం నాటి హుండీ ఆదాయం:** రూ.3.10 కోట్లు

**బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు:** 62,223

**తలనీలాలు సమర్పించినవారు:** 19,704








# కొత్త బంగారు లోకం

తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రకృతితో మమేకమవుతూ అడుగులు వేయడం ఓ మధురానుభూతి.. అటవీప్రాంతాన కొండలు, గుట్టలు ఎక్కుతూ ముందుకు సాగిపోవడం ఓ అందమైన అనుభవం. ప్రకృతి ప్రియుల్లో సాహస ప్రవృత్తిని పెంచే ట్రెక్కింగ్ ఇలాంటి విశేషాలెన్నింటినో పరిచయం చేస్తుంది. శేషాచల అడవుల అందాలను ఆస్వాదించే అవకాశం కలిగిస్తుంది. ట్రెక్కింగ్ అభిరుచి ఉంచేచాలు.. 'తిరుపతి అడ్వెంచరెస్ అడిక్ట్స్' గ్రూప్ మిమ్మల్ని కాంక్రీట్ జంగిల్ నుంచి పచ్చని సోయగాల మధ్య నడిపిస్తుంది. అందమైన సూర్యోదయాలు, కనువిందు చేసే వనాలు, పారే కాలువలను దాటుకుంటూ కాలాన్ని మర్చిపోయేలా చేస్తుందీ ప్రయాణం. ఓ ఆదివారం ఉల్లాసంగా గడపడానికి తిరుపతి అడ్వెంచరెస్ అడిక్ట్స్‌తో చేతులు కలిపేయండి మరి.

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ముందడుగు
ఓ యువకుడి చొరవతో సాహసయాత్ర
శేషాచలాన్ని చుట్టేస్తున్న ట్రెక్కర్లు

### ఆరుగురితో సమూహానికి శ్రీకారం

తిరుపతికి చెందిన ఇనేష్ సిదార్థ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్. ఐదారేళ్లుగా శేషాచల అడవుల్లో సాహసోపేతమైన ట్రెక్కింగులకు వెళ్లి అద్భుతమైన ప్రకృతి అందాలు, పక్షులు, వన్యప్రాణులను కెమెరాలో బంధించడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ యువకుడి అభిరుచికి స్నేహితులు భానుప్రకాష్, హేమకుమార్, దేవప్రసాద్, విష్ణు, వెంకటముని జత కలిశారు. వీరంతా ఇటీవల 'తిరుపతి అడ్వంచర్ అడిక్ట్స్' అనే ట్రెక్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. 38 రోజుల్లోనే తిరుపతి సమీపంలోని శేషాచల అడవుల్లోని ఆరు ప్రాంతాల్లో విజయవంతంగా టెక్కింగ్ నిర్వహించారు. తాటికోన, కాలభైవరగుట్ట, మల్లమడుగు, మెగాలిత్, మామండూరు, పేర్నిటి హిల్ వంటి ప్రాంతాలను చుట్టేశారు. దాదాపు 300 మందికి పైగా ట్రెక్కింగ్ లవర్స్ పాల్గొని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. సుందరగిరులు, సహజ వనరులను అన్వేషించడంలో ఈ గ్రూప్ విశేషంగా కృషి చేస్తోంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో సఫలీకృతమవుతోంది.

### ప్రతి ఆదివారం విహారం

ఈగ్రూప్ ప్రతి ఆదివారం ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహిస్తోంది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఔత్సాహికులను సమీకరించి ఉత్సాహపరుస్తోంది. సూర్యోదయ వీక్షణం కోసం వీరంతా వేకువజామునే శ్రీకారం చుడుతున్నారు. సాయంత్రానికి తిరిగొచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నారు. పిల్లల నుంచి 65 ఏళ్ల వృద్ధుల వరకూ ఈ సాహసయాత్రలో పాలుపంచుకుంటున్నారు. విద్యార్థులు, డాక్టర్లు, టెకీలు, వ్యాపారులు, లాయర్లు, ఇలా వివిధ రంగాల వారు పరస్పరం ఊసులాడుకుంటూ ఒక్కటై కలిసిపోతున్నారు.కొన్ని గంటల పాటు ప్రత్యేక లోకంలో విహరిస్తున్నామా అనే భావన కలుగుతోందని గ్రూప్ సభ్యులు చెబుతున్నారు.





### తిరుపతి సమీప అందాలు చూపడమే లక్ష్యం

తిరుపతి, తిరుమల గొప్ప పుణ్యక్షేత్రాలని అందరికీ తెలుసు. కానీ అడ్వెంచరెస్ ప్రేమికులకు తెలియని అందమైన అడవులు, కొండలు, ప్రదేశాలు తిరుపతి చుట్టూ ఉన్నాయి. అడ్వెంచరెస్ టూరిజాన్ని పెంపొందించడం మా లక్ష్యం. మాతో వచ్చిన వారు గుర్తుండిపోయేలా అందమైన జ్ఞాపకాలను పొందుతున్నారు. ఆధునిక జీవనశైలిలో చాలా మంది శారీరక దృఢత్వాన్ని కోల్పోతున్నారు. ట్రెక్కింగుల ద్వారా శారీరక దృఢత్వాన్ని, మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు. దైనందిన ఒత్తిడి నుంచి ప్రకృతి ద్వారా ఉపశమనం పొందవచ్చు.

- ఇనేష్ సిద్ధార్థ, సంస్థ వ్యవస్థాపకుడు

# నూతన ఆవిష్కరణలకే గుర్తింపు

● తిరుపతిలో ఐఐటీలో పాన్ వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ శాటిలైట్ ఈవెంట్ ● తిరుపతి ఐఐటీ- వీల్స్ మధ్య కుదిరిన ఒప్పందం



తిరుపతి ఐఐటీలో జరిగిన ఈవెంట్‌కు హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలతోనే గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. పాన్ - ఐఐటీ వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ(పీఐడబ్ల్యూటీ)శాటిలైట్ ఈవెంట్ తిరుపతి ఐఐటీలో గురువారం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, అధ్యాపకులు, విద్యారంగం, పరిశ్రమలు, ప్రభుత్వం నుంచి మేధావులు, నిపుణులు ఈవెంట్‌లో పాలుపంచుకున్నారు. వీల్స్ గ్లోబల్, కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఆంధ్రప్రదేశ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ప్రారంభోపన్యాసంతో మొదలైంది. సీఐఐ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ వి.మురళీకృష్ణ, రతన్ అగర్వాల్, వీల్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు అగర్వాల్ పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. సమావేశంలో మొదట వికసిత్ భారత్ కోసం పరిశ్రమల్లో విద్యా సహకారంలో తీసుకోవాల్సిన మార్పులు తదితర అంశాలపై చర్చించారు. మేరీల్యాండ్ బాల్టీమోర్ కౌంటీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ గోవిందరావు, సి.శ్రీనివాసరాజు, శ్రీసిటీ ఇంటిగ్రేటెడ్ బిజినెస్ అధ్యక్షుడు సతీస్ కామత్ నూతన ఆవిష్కరణలకు, అభివృద్ధికి అవసరమైన సూచనలను అందజేశారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో బ్రిడ్జింగ్ టెక్నాలజీ, గ్రామీణ అభివృద్ధిపై ప్యానల్ సమావేశం, సుదీర్ఘ చర్చ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి అవసరమైన సాంకేతికతను ఉపయోగించడంపై చర్చించారు. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ గురించి రమాకాంత్ దేశాయ్ చర్చించారు. పర్యావరణ సామాజిక పాలన ఆవిష్కరణ ప్రభావాన్ని నడిపించడానికి విద్య-పరిశ్రమ భాగస్వామ్యాలపై డాక్టర్ రాఘవన్ రామనన్ మాట్లాడారు. అనంతరం వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించే పరిశోధన పోస్టరు ప్రదర్శనతో సదస్సు ముగిసింది. పీఐడబ్ల్యూటీ ఉపగ్రహ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా తిరుపతి ఐఐటీ ప్రభావవంతమైన పరిశోధనలను నడిపించడం, ఆవిష్కరణలు పెంపొందించడం ముఖ్య ఉద్దేశంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి విద్య- పరిశ్రమల మధ్య వారధులను నిర్మించడం పట్ల సదస్సులో మేధావుల చర్యలతో ఐఐటీ ప్రాంగణం కొత్తకళను సంతరించుకుంది.

# వచ్చారు.. వెళ్లారు!

● మల్లిమడుగులో అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారుల తూ..తూ..మంత్ర పరిశీలన



మల్లిమడుగు వంకలోకి వచ్చే వాగు వద్ద కందకాలు పూడ్చి వేసి పైపులు పెట్టి రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ఐ కృష్ణ

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరులో అక్రమ మట్టి తవ్వకాలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మల్లిమడుగులో మళ్లీ మట్టి తవ్వకాలు' శీర్షికన వార్తా కథనం ప్రచురితం కావడంతో మైనింగ్ అధికారులు తూ.. తూ.. మంత్రంగా స్పందించారు. గురువారం మధ్యాహ్నం మట్టి తవ్విన ప్రాంతాలను అలా వచ్చి ఇలా పరిశీలించి వెళ్లిపోయారు. ఈ విషయమై నివేదికలు సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని తమ ఫొటోలు, పేర్లు రాయవద్దన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే జిల్లా అధికారిని సంప్రదించాలని పరిశీలనకు వచ్చిన మైనింగ్ అధికారి తెలిపారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారులను వివరణ కోరేందుకు ఫోన్లో సంప్రదించగా సదరు అధికారి స్పందించ లేదు.

**టెండర్లు తీసుకున్న వాళ్లు చెక్‌పోస్టులు పెట్టుకోవచ్చు**

జిల్లాలో ప్రభుత్వం వద్ద మైనింగ్‌కు సంబంధించి టెండర్లు తీసుకున్న వాళ్లు ప్రత్యేకమైన చెక్‌పోస్టులు పెట్టుకోవచ్చని రేణిగుంట మండల పరిధిలో ఈ ప్రాంతంలో కాకుండా గాజులమండ్యం ప్రాంతంలో సైతం మైన్స్ తరలించే వాహనాలకు బిల్లులు తనిఖీ చేయవచ్చని మైనింగ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# పట్టు తప్పిన పోలీసు శాఖ

గాడిలో పెట్టండి ఎస్పీగారూ!

జిల్లా పోలీసు శాఖ పట్టుతప్పింది. కొన్ని స్టేషన్లలో ఎవరికి వారే యమునా తీరులాగా తయారయ్యారు. ప్రధానంగా జిల్లాలోని కొన్ని స్టేషన్లు సెటిల్‌మెంట్లుకు అడ్డాగా మారాయనే విమర్శలున్నాయి. ప్రధానంగా శ్రీకాళహస్తి, రామచంద్రాపురం, సత్యవేడు, నాయుడుపేట, పాకాల, అలిపిరి, ఏర్పేడు, తిరుమల టూ టౌన్ తదితర స్టేషన్లపై ఈ విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. రేణిగుంట తీరు మీద కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూ వ్యవహారాల్లో పోలీసులు తలదూరుస్తున్నారనే విమర్శలున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

### ఏళ్ళ తరబడి తిష్ట.. దిగజారుతున్న ప్రతిష్ఠ



జిల్లాలోని తిరుపతి, తిరుమల పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది కొందరు ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసి కూర్చున్నారు. తిరుమల టూ టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఏఎస్ఐ కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ వరకు కొండ దిగడం లేదు. ఇక తిరుమల 1 టౌన్, టూటౌన్, క్రైం, ట్రాఫిక్ స్టేషన్లలో పనిచేస్తున్న సీఐలు రెండు, మూడేళ్ళకు బదిలీ అవుతున్నా కింది స్థాయి సిబ్బందికి మాత్రం స్థాన చలనం జరగడం లేదు. వన్‌టౌన్ స్టేషన్‌లో ప్రొటోకాల్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఉన్నత స్థాయి అధికారుల అండదండలతో కొండ దిగని ఘనుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఇక తిరుపతి అలిపిరి స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్ దాదాపు 15 సంవత్సరాలుగా అక్కడే తిష్ట వేసి కూర్చొని సెటిల్‌మెంట్లు, భూ దందాలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అలాగే వెస్ట్‌లో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఏఎస్ఐ, రైటర్ హవా కొనసాగిస్తున్నారు. బహిరంగ మద్యపానం విషయంలోనూ, బార్లు వద్ద కొట్లాటలు, ఘర్షణలు జరిగినా తిరుపతిలోని పోలీసులకు కాసులు వర్షం కురిపిస్తోంది. తిరుపతి రూరల్, ఈస్ట్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు, పాకాల, శ్రీకాళహస్తి, సత్యవేడు, నారాయణవనం వంటి స్టేషన్లలో దీర్ఘకాలంగా ఉన్న రైటర్ల తీరు వల్ల పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. కొన్ని స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్ఐలు నేరుగా సీఐలను శాసించే స్థాయికి ఎదిగారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పోలీసుల తీరును గ్రహించిన ఎస్పీ సుబ్బరాయుడు దాదాపు 10 మందిపై సస్పెన్షన్లు, చార్జి మెమోలు జారీ చేశారు. కొందరిని వీఆర్‌కు బదిలీ చేశారు. తప్పు చేస్తే దండన తప్పదనే భయం కొంతవరకు పోలీసు శాఖలో పుట్టింది. ఇంతలోనే ఆయన్ను ప్రభుత్వం బదిలీ చేసింది.

### తిరుపతి ట్రాఫిక్ గాడిలో పడేనా?

తిరుపతి ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ట్రాఫిక్‌లో పనిచేస్తున్న కొందరు అధికారులు రోడ్లపైకి రాకుండా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వున్నాయి. గతంలో ఎస్పీగా పనిచేసిన సుబ్బరాయుడు సెల్ కాన్ఫరెన్సులో ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఒక సీఐ పనితీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొన్ని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది అసలు కనపడని పరిస్థితి. లీలా మహల్ సర్కిల్. పూర్ణకుంభం సర్కిల్, అన్నమయ్య సర్కిల్, బాలాజీ కాలనీ, ఎంఆర్‌పల్లి, కృష్ణాపురం ఠానా, తిరుమల బైపాస్ రోడ్డు, గాంధీ రోడ్డు వంటి ప్రధాన రహదారుల్లో వెళ్ళాలంటేనే బీపీ వస్తోంది. అడ్డదిడ్డం పార్కింగ్‌లు, హారన్ల మోత, నెంబరు ప్లేట్లు లేని ఆటోలు, లైసెన్సులు లేని వాహనదారులతో తిరుపతి ట్రాఫిక్ గందరగోళంగా తయారైంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తిరుపతి ట్రాఫిక్‌ను దారిలో పెట్టాల్సిన ప్రధాన బాధ్యత నూతన ఎస్పీగా బాధ్యతలు తీసుకుంటున్న హర్షవర్ధన రాజుపై వుంది. ఇక గంజాయి అక్రమ రవాణాకు అడ్డాలుగా మారిన తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్లలో గట్టి భద్రత ఏర్పాటు చేయాల్సి వుంది.

**నేడు జిల్లా ఎస్పీగా హర్షవర్ధన రాజు బాధ్యతలు స్వీకరణ**

తిరుపతి జిల్లా ఎస్పీగా మళ్ళీ హర్షవర్ధన రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఇక్కడ రెండు నెలల పాటు సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఆయనకు వుంది.ఆయన గురువారం తిరుపతికి చేరుకున్నారు.శుక్రవారం తిరుమలలో శ్రీవారినిదర్శించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఉపాధి కల్పన ప్రణాళికలు రూపొందించండి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు వారు కోరుకుంటున్న రంగంలో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీ యూనివర్శిటీలో ప్రతినెలా డ్రోన్, నారావారిపల్లెలో లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ జాబ్‌మేళా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీరామమూర్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, పలు యూనివర్సిటీల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



# రూ.4.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

● ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్



స్మగ్లర్లతో పాటు ఎర్రచందనం చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గుడిపాల మండలం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురువారం ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. రహస్య సమాచారం మేరకు గుడిపాల మండల పరిధిలోని చిత్తూరు, వేలూరు మార్గంలో పానాటూరు సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన స్మగ్లర్లు కంటైనర్ వాహనాన్ని దూరంగా ఆపి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కంటైనర్ తనిఖీ చేయగా ఏడు టన్నుల బరువు గల 413 ఎర్రచందనం దుంగలు బయటపడినట్లు వెల్లడించారు. పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.4.5 కోట్లు ఉంటుందన్నారు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాలోని గోడౌన్ నుంచి దుంగలను అసోంకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పట్టుబడిన వారు తమిళనాడుకు చెందిన నరేంద్రకుమార్, అసోంకు చెందిన బినోయికుమార్, రాజస్థాన్‌కు చెందిన విజయ్‌జోషిలుగా గుర్తించామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

## కేవీకేలలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(క్రీడలు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, సత్యవేడులోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తిలో బ్యాడ్మింటన్ శిక్షకుడి, నైట్ వాచ్‌మన్, సత్యవేడులో నైట్‌వాచ్‌మన్ పోస్టు మాత్రమే ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి చదివి, ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు 98663 17312 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## ఎలుకల నివారణ మందు పంపిణీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 19 మండలాల్లో 80 వేల హెక్టార్లలో రబీ సీజనులో ఎలుకల నుంచి పంటలను కాపాడుకునే చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ధనంజయ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. గురు, శుక్రవారాల్లో పంచాయతీల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## టీడీపీ నాయకుల రక్తదానం



కోట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కోటలో గురువారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో భారీ కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గూడూరు ఆస్పత్రి సిబ్బంది పర్యవేక్షణలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. రక్తదాతలకు జలీల్ అహ్మద్‌తోపాటు టీడీపీ నాయకులు ప్రసంశాపత్రాలు అందజేసి అభినం దించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నల్లపరెడ్డి జగన్‌హన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, తీగల సురేష్‌బాబు, వాకా విజయభాస్కర్‌రెడ్డి, సుష్మారెడ్డి, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, మస్తాన్‌బాషా ఉన్నారు.

**ఓజిలి:** మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేటలో జరిగిన సంబరాలకు టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు తరలివెళ్లారు. పలువురు రక్తదానం చేశారు. ఓజిలి మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఓజిలి క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి నిబంధనలు పాటించాలి

గూడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం ఆదిశంకర కళాశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో టీఎస్‌కే కిషోర్, ఎంవీఐలు అజాద్ జాకీర్, శాంతి, ఏఎంవీఐ ప్రభాకర్, ఏవో శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

## 28న జాబ్‌మేళా

గూడూరు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో లేదా ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని ఆయన వెల్లడించారు.

## విద్యార్థి చదువుకు రూ.10వేల సాయం

కోట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కోటలోని శ్రీషిరిడీసాయి అక్షయ సేవాసమితి కార్యాలయంలో గురువారం వాకాడు మండలం కోడివాక గ్రామానికి చెందిన నట్టేటి చరణ్‌తేజకు ఆ సంస్థ కన్వీనర్ అల్లంరమణయ్య చేతుల మీదుగా రూ.10వేల చెక్కును గురువారం అందజేశారు. చరణ్‌తేజ ఇంటర్ చదువుతున్నాడు. నిరుపేద కావడంతో ఆర్థికసాయం అందించారు. అక్షయ సేవాసమితి బృందం వారు గూడూరుకు చెందిన పూతల కామాక్షమ్మ దాతృత్వంతో రూ.10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్షయ సేవాసమితి ప్రతినిధులు కోటేశ్వరరెడ్డి, పన్నగసాయి తదితరులు ఉన్నారు.

## క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

డక్కిలి, జనవరి 23 : (ఆంధ్రజ్యోతి) క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు అన్నారు. డక్కిలిలో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న క్రికెట్ పోటీలు ముగిశాయి. గురువారం నిర్వహించిన ఫైనల్స్‌లో కమ్మపల్లి రోడ్డు జట్టు విజేతగా నిలిచింది. లింగసముద్రం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేతకు రూ.50వేల నగదు షీల్డ్ అందించారు. విజేతకు రూ.25వేల నగదు అందించారు. ఈ పోటీలను డక్కిలికి చెందిన పిన్నక సోదరులు తమ తల్లిదండ్రులు కొండయ్య, రత్నమ్మల జ్ఞాపకార్థం నిర్వహించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన లింగసముద్రం కెప్టెన్ గంగాధర్‌కు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రూ.10 వేలు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన అబికి ఎంపీడీవో గుణశేఖరరెడ్డి రూ.5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పిన్నక సోదరులు జగదీష్ బాబు, జగదీష్, పాస్టర్ ఫ్రాన్సిస్ హాజరయ్యారు.

## ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య ప్రతిభ

గూడూరు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన క్యాట్ లెవెల్-2 ఒలంపియాడ్ పరీక్షలలో గూడూరులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు వెల్లడించారు. మొత్తం 110 మంది విద్యార్థులు ప్రతిభకనబరచగా అందులో 16 మంది విద్యార్థులు క్యాష్ ప్రైజ్, మెడల్, మెరిట్ సర్టిఫికెట్లను సాధించారన్నారు. మరో 50 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు పొందగా, 44 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని వివరించారు. గురువారం పాఠశాల ఆవరణంలో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం శ్రీకాంత్, డీన్‌లు శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ వద్దు.. పంచాయతీనే ముద్దు



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

చిల్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు పంచాయతీని గూడూరు మున్సి పాలిటీ నుంచి తొలగించి పంచాయతీ చేయాలని చిల్లకూరు గ్రామస్తులు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో కోరారు. దీంతో ఆయన పంచాయతీ ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. అదేవిధంగా చెన్నూరు, నెల్లటూరు, పోటుపాళెం, దివిపాళెం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గోపి, చిల్లకూరు, చెన్నూరు పంచాయతీల టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## మోటారు సైకిళ్ల స్వాధీనం : ఒకరి అరెస్టు

నాయుడుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణాపురం, అమరావతి సెంటర్ వద్ద ఈ నెల 23వ తేదీ రెండు మోటారు సైకిళ్ల చోరీకి గురయ్యాయి. యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా గురువారం పట్టణానికి చెందిన వెంకటేష్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాబి తెలిపారు.

## అమిత్ షా క్షమాపణ చెప్పాలి

సూళ్లూరుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో గురువారం నిరసన ర్యాలీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటచలపతి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు.

## కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం



సూళ్లూరుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. 1973-75 సంవత్సరంలో సైన్సు గ్రూపు అభ్యసించిన విద్యార్థులు గురువారం కళాశాలలో కలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్‌ను సత్కరించారు. కళాశాల స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. తాము చదివిన కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ప్రిన్సిపాల్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం భాస్కర్‌బాబు, కళత్తూరు యుగంధర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముప్పాళ్ల సుకుమార్, రాజేశ్వరి, లలిత, మంజులా, సౌజన్య, కే.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నిధుల వివరాలివ్వండి

వెంకటగిరిటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 1 నుంచి 25 వార్డులకు సంబంధించి 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వివరాలు ఇవ్వాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందించారు. 2021 డిసెంబరు నెల వరకు విడుదలైన నిధులు, ఖర్చు వివరాలు ఇవ్వాలని విన్నవించారు.

## జనసేన సంబరాలు



వెంకటగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల గుర్తుగా గాజు గ్లాసును కేటాయించడంతో గురువారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని తెలుగు గంగ అతిథి గృహం వద్ద సంబరాలు చేసుకున్నారు. జనసేన నాయకులు తోట క్రిష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌రామారావు, రాజేష్, రవి శంకర్, రవీంద్రరుడు, అపర్ణ, రేవతి పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్ల పట్టివేత

చిట్టమూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముగుంటపాళానికి చెందిన యనమల వెంకటయ్య 9 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా వాకాడు ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

## సమస్యలు పరిష్కరించాలి

నాయుడుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్, ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి కోరారు. నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎస్వీ యూనివర్శిటీలో 28, 29 తేదీలలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు గోడపత్రికలను ఆవిష్కరించారు.


## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

తడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక అపాచీ పరిశ్రమలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఎస్ఐ కొండప నాయుడు, అపాచీ పీఆర్‌వో మోహన్, భాను పాల్గొన్నారు.

## అల్లంపాడులో భూముల రీసర్వే

కోట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అల్లంపాడులో గురువారం భూముల రీసర్వే జరిగింది. తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో సర్వేయర్ గోపీరెడ్డి పర్యవేక్షణలో వీఆర్వోలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు, మోసీన్‌లు రైతుల సమక్షంలో రీసర్వేను ప్రారంభించారు. అల్లంపాడు పంచాయతీలో 830.25 ఎకరాలకు సంబంధించి భూముల రీసర్వేను నాలుగు బృందాలుగా అప్ప గించారు. మొదటిరోజు సర్వే వేగవంతమైంది.

## నేతాజీ చిరస్మరణీయుడు



వెంకటగిరిటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేతాజీ కూడలి వద్ద నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐ ఏవీ.రమణ, ఫౌండేషన్ అధ్యక్షులు మల్లిఖార్జున, రామకృష్ణ, రవి, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**చిల్లకూరు:** మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**కోట:** కోటలో బీజేపీ నాయకులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌బాబు, కోటారెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, అంబరీషా, వెంకటేశ్వర్లు, వెంకయ్యగౌడ్ ఉన్నారు.

# భవిష్యత్తుకు మంత్రి లోకేశ్ కృషి



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువత బంగారు భవిష్యత్తుకు మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌కట్ చేశారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, శ్రీదేవి, భారతి పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ.. విద్యార్థులకు అన్నదానం





రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, మాధవనాయుడు ● కేక్ కట్‌చేస్తున్న సతీష్‌రెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలకు గురువారం సూళ్లూరుపేటలో ఆ పార్టీ నాయకులు పోటాపోటీగా రెండు చోట్ల నిర్వహించారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లను అందజేసి రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో అన్నదానం చేశారు.

● టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి కేక్‌కట్ చేశారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, నాపా మునిరాజా, చంద్రారెడ్డి, కొక్కు శంకరయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

నాయుడుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలు లేని జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు అన్నారు. నాయుడుపేట విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో గురువారం నాయుడుపేట, గూడూరు డివిజన్‌లోని విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు డివిజన్ పరిధిలో వినియోగదారులు సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని వివరించారు. వేసవి కాలంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుజాగ్రత్తలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాసులు, నరేంద్ర రెడ్డి, రవికుమార్, ఎస్‌వో శ్రీనివాసులు, నాయుడుపేట డీఈ వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేశ్ నేతృత్వం యువతకు భరోసా



కేక్ కట్‌చేస్తున్న వేనాటి సతీష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రత్నం తదితరులు

నాయుడుపేట, జనవరి 23 : మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో యువత భవిష్యత్తుకు భరోసా ఉంటోందని తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అన్నారు. మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం నాయుడుపేటలో అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, రూరల్ అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుదూరు రత్నం, అత్తికాయల సుబ్రహ్మణ్యం, సులేమాన్, సిరాజ్, గుంటూరు లక్ష్మయ్య, శ్రీనివాసులు, రఫి తదితరులు ఉన్నారు.

## వెంకటగిరిలో టీడీపీ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు

వెంకటగిరి, జనవరి 23 : (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామకృష్ణ కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, తోట రామచంద్రయ్య, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఏలేశ్వరం రామ చంద్రయ్య నాయుడు, మంకు ఆనంద్, అవ్వారు సత్య నారాయణ, చెలికం ముధురెడ్డి, నరసింహులు, మచ్చల వేణు, మునెయ్య, చెంగారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## భర్త ఆత్మహత్య

దొరవారిసత్రం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీధనమల్లిలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. తొగరాముడి మునిశేఖర్ (28)కు ఆయన భార్య మధ్య చిన్న వివాదం తలెత్తింది. భార్య అలిగి పుట్టింటి కెళ్లింది. మనస్తాపం చెందిన మునిశేఖర్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. గురువారం బంధువులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

## పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు: స్థానిక బాలాజీనగర్‌లో రాష్ట్ర కాపునాడు జనరల్ సెక్రటరీ కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్‌బాబు పుట్టినరోజు నిర్వహించారు. కేక్‌కట్ చేశారు. పేదలకు దుస్తులు అందించారు.

## మున్సిపల్ అభివృద్ధికి చర్యలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వెంకటగిరి, జనవరి 23: (ఆంధ్రజ్యోతి) వెంకటగిరి మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులు, బిల్ కలెక్టర్లు, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీధర్‌తో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లకు అనుమతులతో పాటు పన్నుల వసూళ్ల సకాలంలో వసూలు చేయాలని సూచించారు.

● **ఖాళీ బిందెలతో నిరసన**

పట్టణ పరిధిలోని 5వ వార్డు దొమ్మరపాళెం మహిళలు తమ వార్డులో నీరు రావడం లేదని, వీధి దీపాలు, కాలువలు లేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే కురుగొండ్లను కలిసి వినతిపత్రం అందచేశారు. స్పందించిన ఆయన వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అంతకు ముందు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు.

## వాకాడులో లోకేశ్ జన్మదినం



వాకాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అశోక్ పిల్లర్ ప్రాంగణంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దోశకాయల కృష్ణమూర్తి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, అన్నమేటి చంద్రయ్య, వాకాటి సంపత్‌కుమార్, మోహన్‌నాయుడు, కుంచం దయాకర్, గోవిందరాజులు పాల్గొన్నారు.

## చిన్నాన్నపై కత్తితో దాడి

నాయుడుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అత్తలపాలెంలో చిన్నాన్నపై అన్న కుమారుడు దాడిచేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. నాగరాజు తమ పొలం సర్వే కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై నాగరాజుకు ఆయన అన్న కుమారుడు సుధాకర్‌కు వివాదం నెలకొంది. ఈ ఘర్షణలో చిన్నాన్నపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. గ్రామస్తులు నాగరాజును నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## హెల్మెట్ ధరించాలి

ఓజిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహన చోదకులు తమ వాహనానికి సంబంధించి అన్ని పత్రాలతోపాటు లైసెన్సు ఉండాలని ఓజిలి ఎస్ఐ స్వప్న తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆమె మాట్లాడుతూ వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## పేదలకు అన్నదానం



పెళ్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరులో టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధునాయుడు ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్‌చేశారు. ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. పేదలకు అన్నదానం చేశారు. పెళ్లకూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పేరం వెంకటతేజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.5వేలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ప్రసాద్‌నాయుడు, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధు నాయుడు, నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, శివకుమార్, మునీష్, చైతన్య కృష్ణారెడ్డి, శేఖర్‌నాయుడు, సిద్ధులయ్యనాయుడు ఉన్నారు.

## కొత్తగుంటలో లోకేశ్ పుట్టిన రోజు



చిట్టమూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు (కొత్తగుంట)లో గురు వారం మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చిన్నారావు, టీడీపీ నాయకులు మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, బసిరెడ్డి హరికృష్ణారెడ్డి, గోపాల్‌నాయు డు, బాబు నాయుడు, చెంచురామయ్య ఆచారి, రషీద్, కస్తూరయ్య, రాజేష్‌రెడ్డి, బషీర్, సుధ, అంకయ్య, ముత్తు, బాబురెడ్డి, వెంకట రమణయ్య, మణి, ఓమనరావు ఉన్నారు.

## ఉనికి కోసమే పోరుబాట



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తన ఉనికిని కాపాడుకోవడం కోసం పోరుబాట కార్యక్రమం పేరుతో ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి , పేరం సందీప్ తేజ పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వ పాలనలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వైసీపీ అధినేత జగన్‌తో పాటు ముఖ్య నాయకులంతా ఏమిచేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో సత్యనారాయణరెడ్డి నెలకోరోజు గ్రామాల్లో టీడీపీపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలనూ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.